# అప్పుడు రాష్ట్రం కోసం...
# ఇప్పుడు భాష కోసం...
## ఎప్పుడూ పోరాటమే...

నందివెలుగు ముక్తేశ్వరరావు
విశ్రాంత ఐ.ఏ.ఎస్. అధికారి

# ముందుగా ఓ మాట...

## తిరిగి ఆలోచించే తరుణమిది

తెలుగు నుడి, సంస్కృతులకు పూర్వ వైభవం తేవటానికి మాత్రమే ఉద్యమిస్తున్న ఏకైక సంస్థ **తెలుగు కూటమి**. అందులో భాగంగానే ప్రభుత్వ, ప్రైవేట్ బడులలో కూడ 5 వ తరగతి వరకు తెలుగు మాధ్యమం మాత్రమే ఉండాలి అని కోరుతున్నాం.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో విద్యార్థులు తెలుగులో గాని, ఇంగ్లీషులో గాని గట్టి ప్రావీణ్యత సంపాదించలేక వెనకబడి పోతున్నారు. విద్యార్థుల అభ్యసన శక్తిని పరీక్షించే యాసర్ వారు నిర్వహించిన పరీక్షలో ఎనిమిదివ తరగతి చదువుతున్న వారిలో మూడోవంతు పిల్లలు రెండవ తరగతి పాఠ్యపుస్తకాలు కూడా చదవలేక పోతున్నారు అని తేలింది.

వీటన్నిటిలో ప్రధానంగా ఒక వాస్తవం దాగి ఉంది. మేధావులందరూ ఎంత మొత్తుకున్నా కూడా బోధనా మాధ్యమంను నిర్ణయించటంలో ప్రభుత్వం తడబడింది. ఈ పరిస్థితుల్లో ఆలోచన గల తల్లిదండ్రులు, బాధ్యత గల పౌరులు తమ పిల్లలను సరైన మార్గంలో తీసుకువెళుతున్నామా లేక పసిప్రాయంలో ఆంగ్ల మాధ్యమం అనే ఒత్తిడితో పిల్లలను గందరగోళపరుస్తున్నామా అని తల పట్టుకున్నారు.

నల్గొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన విశ్రాంత ఐ.ఏ.ఎస్. అధికారి శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు గారు పరిపాలనలో తన అనుభవంతో సమాజంలో వివిధ వర్గాల పిల్లలు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను లోతుగా పరిశీలించి ప్రజల్లో ఉన్న సహజ సందేహాలను, అపోహలను నివృత్తి చేయటానికి ఈ పుస్తకాన్ని చక్కగా రాశారు. తెలుగు ప్రజలకు, పిల్లల తల్లిదండ్రులకు, విధాన నిర్ణేతలకు ఈ పుస్తకం మంచి దారి చూపి ఒక సరైన నిర్ణయానికి రాటానికి అవకాశం కల్పిస్తుంది అని తెలుగు కూటమి సంస్థ భావిస్తున్నది. ఈ పుస్తకంలో చర్చించిన విషయాలు విస్తృత స్థాయిలో ప్రజలు చదువుతారని బోధనా మధ్యమం పట్ల తమ అవగాహన పెంచుకోగలరని ఆశిస్తున్నాము. మన వలగూడు (telugukootami.org) లో ఇప్పటికే ముక్తేశ్వర రావు గారి రెండు పుస్తకాలు (పిడిఎఫ్) ఉన్నాయి.

ప్రతి నెల 2వ మరియు 4వ శనివారాల్లో మాపులు 7 గం.లకు తెలుగు ఉద్యమంలో భాగంగా జరిగే రచ్చబండలో ఈ లంకెను మీటి మీరు చేరవచ్చు:https://meet.google.com/ste-jdoz-xbs

మా కార్యక్రమాల్లో మొదటి నుంచి మాకు సాయపడుతున్న **తానా సంస్థ** కు, ఈ పుస్తక ప్రచురణలో ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు వచ్చిన ప్రస్తుత **తానా** అధ్యక్షులు శ్రీ శృంగవరపు నిరంజన్ గారికి నిండు డెందంతో నెనరులు.

**జిడుగు రవీంద్రనాథ్**
చేపలుకు: **94408 01883**
ravindranath.gidugu@gmail.com
తెలుగు కూటమి, విజయవాడ.

దేశ స్వాతంత్ర్యం కోసం భారతీయులు అంతా ఉరుకులెత్తుతున్న తరుణంలో... తెలుగు జాతి జవంతో జీవంతో మేము సైతం అంటూ ముందుకు ఉరికాం. తెలుగు కవులు కలాలెత్తి, గళాలెత్తి జాతీయ నుడికారంతో తెలుగు మమకారాన్ని రంగరించి అన్ని రంగాలలో ఒకే జాతిగా కదంతొక్కాం. దుర్మార్గాన్ని ఎదిరించే మానవీయ మహాప్రస్థానంలోనూ మనిషిని మనిషిగా తీర్చిదిద్దే సంస్కరణోద్యమాల్లోనూ మనమే ముందుండి ముందుకు నడిచాం.

ఆనాడు మన తెలుగు జాతిని ఇంత వైభవోపేతంగా తీర్చిదిద్దిన మహాపురుషుల్ని, మహాకవుల్ని, శౌర్యధనుల్ని, సంస్కార పరాక్రముల్ని స్మరించుకుంటూ భాషామతల్లి ఒడిలో సేదతీరిన తెలుగువారంతా ఏకఛత్రం కిందకు రావడానికి మా రాష్ట్రం మాకివ్వండి అని నిలదీశాం, నిలబడ్డాం. మహనీయుడు పొట్టిశ్రీరాములు ఆత్మబలిదానంతో అప్పటిదాకా కొండెక్కి కూర్చొన్న కేంద్ర పెద్దలు నేలకు దిగివచ్చి, 'మీ రాష్ట్రం మీకిస్తాం, మీ రాజ్యం మీరు ఏలుకోండి' అని మనకి ఆంధ్రరాష్ట్రం ఇచ్చారు. దేశంలో భాష మీద, భాష ఆధారంగా ఏర్పడిన తొలి రాష్ట్రం తెలుగు వాళ్ళది కావడం గర్వకారణం.

రాష్ట్రం వచ్చిన తరువాత ప్రయాణంలో బోలెడన్ని ఎగుడు దిగుడులు, అపార్థాలు, అన్యాయాలు ఎన్ని ఉన్నా ముందుకే పోతున్నామన్న సమయంలో... ఏ భాష మన అందరినీ ఒక జాతిగా తీర్చిదిద్దిందో, ఏ భాష నుడికారం మన మధ్య పేగు బంధం అయ్యిందో, ఏ భాష కోసం మన మహనీయులు అందరూ కలలుకన్నారో ఆ భాషకు సర్వమంగళం పాడే చర్యలు చోటుచేసుకోవడం దురదృష్టం. తప్పు మీద తప్పులు జరిగిపోతున్నాయి. మాతృభాష మీదే పగబట్టినట్టు వ్యవహరించడం ఆరంభం అయ్యింది. ఒకప్పుడు తెలుగు రాష్ట్రం కోసం పోరాడితే, ఇప్పుడు తెలుగు భాష కోసం పోరాడే సమయం వచ్చింది. తెలుగు భాషను గురించి మాతృభాషగానూ అమ్మమాటగానూ మాట్లాడితే అది పాతకాలం సెంటిమెంటులాంటి ధోరణితో తోసిపుచ్చుతున్నారు. బడిలో నుంచి, ఏలుబడిలో నుంచి న్యాయస్థానాల నుంచి, ఎక్కడ చూసినా తెలుగంటే ఒక న్యూనత. ఈ సమస్యని మొత్తం పరిశీలించినప్పుడు

❁ ఇది భాష సమస్యేనా, జాతి మనుగడ సమస్యా?

❁ బడిలోనూ ఏలుబడిలోనూ భాష ఎందుకని అంటరానిది అయిపోయింది?

ఇలాంటి సమస్యల్ని పరిశీలించినప్పుడు వివిధ వర్గాల నుంచి వచ్చిన సమస్యలను దృష్టిలో పెట్టుకుని, సమస్య మూలాలని వివరించే ప్రయత్నమే ఈ చిన్న పుస్తకం. ఇందులో నేను చేసిన ప్రయత్నం అంతా ఈ ప్రశ్నల వెనకాల ఉన్న కారణాలు ఏమిటి? ఆ కారణాల వెనకాల జరుగుతున్నది ఏమిటి? అన్న దానిని మూలాల

నుండి వివరించడానికి ప్రయత్నించాను. ఈ పుస్తకం చదివిన తరువాత మన మనసు తలుపుని తెరిచి ఉంచితే ప్రతి సమస్యకి పరిష్కారం దొరుకుతుంది. ప్రతి పరిష్కారం వెనక ఒక హేతుబద్ధత, ఒక సామంజస్యం ఉండేందుకు ప్రయత్నించాను. ఇందులో నేను విన్నది, కన్నది, నేను స్వయంగా నా అనుభవం ద్వారా చూసింది అన్నిటినీ కలిపి మీ ముందుకు తెస్తున్నాను. దయచేసి మీ మనస్సు వీధి వాకిలి తెరిచిఉంచండి.

దీని గురించి రాస్తున్నప్పుడే నేను సమాంతరంగా ఒక చిన్నపాటి అధ్యయనం చేశాను. ప్రపంచంలో కొన్ని దేశాలలో ఆ దేశాల మాతృభాషల్లోనే విద్యాబోధన డాక్టరేట్ స్థాయి వరకు జరుగుతోంది. ఆ దేశాలు ఎలా ఉన్నాయి? ప్రపంచ దేశాలలో వాటి స్థానం ఏమిటి? ఇలాంటి విషయాలని పరిశీలిస్తున్నప్పుడు కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.  ఏయే దేశాలలో మాతృభాషలలో విద్య ఉందో ఆయా దేశాలలోనూ తన ఆవిష్కరణలు సుసంపపన్నంగా వచ్చాయి. ఒక జాతి బాగా ఆలోచిస్తే అందునా సృజనాత్మకంగా ఆలోచిస్తేనే కొత్త వెలుగుదారులు కనిపిస్తాయి. ఆ కొత్తవెలుగుదారులనే మనం నూతన ఆవిష్కరణలు అంటాం. మాతృభాషలోనే చదువుకున్న ఆయాదేశాల విజయకీర్తుల్ని ఈ పుస్తకం చివర్లో స్థూలంగా వివరించడం జరిగింది. ఇంగ్లీషు అలికిడిలేని దేశాలలో మాతృభాష మాత్రమే రాజ్యం ఏలుతున్న దేశాలలో అక్కడి ప్రజలు సమస్త రంగాలలో సాధించిన మానవ ప్రగతి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

వీటిని చూస్తున్నప్పుడు మన రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, భయాన్ని, ఆందోళనని కలిగించేవిగా ఉన్నాయి. దేశాన్ని ప్రేమించడం అంటే, దేశ ప్రజలని ప్రేమించడం (దేశమంటేమనుషులోయ్), ప్రజలని ప్రేమించడం అంటే ప్రజల భాషలో, ప్రజల హృదయాల్ని ఒరుసుకుంటూ బడిలోనూ ఏలుబడిలోనూ అందరం మాటామాటా కలిసి నడవడం.

**తమ మాతృభాషలో చదువుకున్న పిల్లలు సృజనాత్మకంగా మరియు స్వేచ్ఛగా ఆలోచించడం నేర్చుకుంటారు.**

**– నెల్సన్ మండేలా**

తెలుగు భాషపై ప్రేమ కలిగిన ప్రతి వారికి బోధపర్చాల్సిన పలు అంశాలను నేను ఇందులో ప్రస్తావించదలచాను. వీటిని చదివినప్పుడు కనీసం తెలుగు భాష పరిరక్షణ దిశగా మీరు ఆలోచించగలిగితే నా ప్రయత్నంలో నేను కృతార్థుడను అయినట్లే.

**1. మాతృ భాషని గురించి చర్చించేటప్పుడు అది భాషకు సంబంధించిన సమస్యగానే చాలా మంది చూస్తుంటారు. అది భాష సమస్య మాత్రమేనా?**

**జవాబు:** మాతృ భాష గురించి మాట్లాడుతున్నప్పుడు పైకి మాత్రం ఇది భాష సమస్యగా కనపడినా అంతరాంతరాల్లో భాషను మించి ఒక జాతి సమస్య. ఇది జాతి మనుగడ సమస్య, జాతి అస్తిత్వ సమస్య, జాతి వ్యక్తిత్వ సమస్య. ప్రపంచంలో ఏ దేశంలోనైనా, ఏ భాష మాట్లాడేవాళ్ళైనా మేము ఇంగ్లీషువాళ్ళం, మేము బెంగాలీలం, మేము తమిళవాళ్ళం – అంటూ వాళ్ళ ఉనికిని (ఐడెంటిటీ) చెప్పుకుంటారు. ఏ మాతృభాషకు చెందిన వాళ్ళైనా మేము ఫలానా అని చెప్పుకునేటప్పుడు కులం, ప్రాంతం లాంటిహద్దులన్నీ చెరిపేసుకుని, మేము ఫలానావాళ్ళం అని కూడా ప్రకటించు కుంటారు. భాష మనిషి అస్తిత్వానికి ప్రతీక. అలాంటి మాతృ భాష మరుగునపడడానికి చాపకింద నీరులా జరుగుతున్నదేమిటో గమనిస్తే ముందుగా మనకు మాతృభాషను ఒక మాధ్యమంగా తొలగించడం కనిపిస్తుంది. విద్య విజ్ఞానాలని వ్యాప్తిచేసే విద్యలో మాతృభాషని వాడకపోతే మాతృభాష నెమ్మది నెమ్మదిగా వెనక్కి వెనక్కి జరిగి మాయం అయిపోతుంది. భాషతోపాటు జాతీయతా పోతుంది.

**“మాతృభాషను కాపాడడం అంటే మీ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడం.”**

**– అమర్త్య సేన్**

**2. మాధ్యమం అంటే ఏమిటి (మీడియం అంటే ఏమిటి?)**

**జవాబు :** నేర్చుకోవడం అనే ప్రక్రియ బడిలో తరగతి గదిలో జరుగుతుంది. తరగతి గదిలో చైతన్యవంతమైన పాత్రలు రెండు ఉంటాయి. నేర్పేవాడు, నేర్చుకునేవాడు. నేర్పేవాళ్లుఉపాధ్యాయులు, నేర్చుకునేవాళ్లు విద్యార్థులు. వీళ్లిద్దరి మధ్య జరిగే ప్రక్రియ జ్ఞానసముపార్జన అంటే నేర్చుకోవడం. నేర్చుకోవడం అనేది, జ్ఞానప్రసారానికి సంబంధించిన మాటలతో నిండిన ప్రక్రియ. ఈ ప్రక్రియలో నేర్పేవాళ్లు, నేర్చుకునేవాళ్లు ఇరువురు ఒకరితో ఒకరుమాట్లాడుకోవాల్సి ఉంటుంది, చర్చించుకోవాల్సి ఉంటుంది, ప్రశ్నించుకోవడం ఉంటుంది. వాళ్ళ మధ్య జరిగే ఈ ప్రక్రియని CRT (Class Room Transaction) అని అంటారు. ఇది తరగతి గదిలో జరిగే వ్యావహారిక ప్రక్రియ. ఇందులో భాష కీలకం. ఇది నేర్చుకునే వాళ్లవైపు (పిల్లల) నుంచి చూడాలా? నేర్పేవారివైపు నుండి చూడాలా అనేది ప్రధానమైన ప్రశ్న. పిల్లలవైపు నుండి చూస్తే పిల్లలకు అర్థమయ్యేవి, పిల్లలు చిన్నప్పటి నుండి ఇంట్లో, చుట్టు పక్కల విన్నవి, తెలిసిన మాటలు మాతృభాషలోనే ఉంటాయి. నేర్చుకోవడంలో వారి అనుభవాలు తోడ్పడతాయి. అతనికి అర్థమయ్యే మాటల్లోనే చదువు చెప్పడం సహజం, న్యాయం, ధర్మం కూడా. వాళ్ళు ఏభాషలో సులభంగా

అర్థం చేసుకోగలరు అని ప్రశ్న వేసుకుంటే మాతృభాషలో అని ఎవరైనా చెబుతారు. ఇందుకు భిన్నంగా నేను ఇంగ్లీషులో చెప్తాను, ఫ్రెంచ్‌లో చెప్తాను అనడం ఒక బలవంతపు చదువే అవుతుంది. దాంతో ఉపాధ్యాయులు చెప్పేవాళ్ళుగాను, పిల్లలు వినేవాళ్ళగాను తరగతి తయారవుతుంది. దాని వలన మనోవికాసం జరగదు. మనోవికాసం జరగనపుడు అభ్యసన జరిగినట్టుకాదు. తమదికాని భాషలో పిల్లలు ఆలోచించ లేరు, ప్రశ్నించలేరు, అర్థం చేసుకోలేరు. ఇది నేడు మీడియం పేరుతో జరుగుతున్న అనర్థకం. నేనుచెప్తాను, మీరు కేవలం వినాలి, నాకు నచ్చినట్టే చేయాలి అనేది రాతియుగంలో కూడా లేని అప్రజాస్వామిక పోకడ.

**"జ్ఞానం మీ హృదయానికి దగ్గరైన భాషలో నేర్చుకోవడం ద్వారా మొదలవుతుంది."**
**– కన్ఫ్యూషియస్**

**3. బలవంతపు చదువులవల్ల పిల్లలకు ఏం అన్యాయం జరుగుతుంది?**

**జవాబు :** మొక్కలు ఎంత సహజంగా ఎదుగుతాయో పిల్లలు అంత సహజంగా నేర్చుకోవాలి. నేర్చుకోవడంలో కృత్రిమత్వం ఉంటే అది వారి మానసిక ఎదుగుదలపై విపరీతమైన ప్రభావం చూపుతుంది. నేర్చుకోవడం అంటే పిల్లలకున్న పూర్వ జ్ఞానంపై తరగతిలో అందించే జ్ఞానంతో కలిసి జ్ఞాన నిర్మాణం జరగాలి. ఇప్పుడున్న పరిస్థితులలో పిల్లలు ఇంట్లో నేర్చుకున్న పరిజ్ఞానం మొత్తం బడి గడప దగ్గర వదిలేయాలి. బడిలో నేర్చుకునేది ఇంటికి తీసుకు వెళ్లాడానికి ఏమి వీలుకాదు. అందువల్ల పిల్లవాడి మానసిక ప్రపంచం బడి ప్రపంచం, ఇంటి ప్రపంచంగా రెండు ప్రపంచాలు అయిపోతుంది. పైగా పిల్లవాడికి తెలిసిన చాలా అంశాలు బడిలో పనికి రాకుండా పోతాయి.

ఉదాహరణకి విద్యార్థికి తన మాతృభాష అయిన తెలుగులో ఒక వంద మొక్కల పేర్లు తెలిస్తే బడిలో వాడి పర భాషలో అయిదు, ఆరుకన్నా తెలుసుకునే అవకాశం లేదు. తనకు తెలిసిన మొక్కలు ఎలాంటివి? వాటి స్వరూప స్వభావాలు ఏమిటి? ఎలా పని చేస్తాయి? ఉపయోగాలు ఏమిటి? లాంటి విజ్ఞానం మొత్తం బడి చదువు బహిష్కరిస్తుంది. ఇది ఆ పిల్లల జీవితాలలో పెద్ద విషాదంగా తయారవుతుంది. తన చెవులకు పరిచయంలేని, తాను వినని పదాలు, తరగతి గదిలో వినపడ్డప్పుడు పిల్లవాడు అర్థం చేసుకోలేడు సరికదా తిరిగి ఆడగటానికి, అడిగిన వాటికి బదులు ఇవ్వడానికి, భయపడిపోతాడు. ఈ భయంవల్ల అతని మనసులో ప్రతిదానికి సంకోచించడం ఆరంభం అవుతుంది. ఈ సంకోచం ఒక్కొక్కప్పుడు ఆత్మన్యూన్యతకు దారితీస్తుంది. ఇది ఒకరకంగా పిల్లల హక్కుల మీద పిల్లల స్వేచ్ఛ మీద, వారి సహజ అభ్యసనం మీద బడి చేసే దాడి అని చెప్పుకోవచ్చు.

**4. ఇంగ్లీషు మీడియం వల్ల మాతృభాషకు ఏం అన్యాయం జరుగుతుంది?**

**జవాబు:** ఏ దేశంలో అయినా ఆ దేశపు నాయకత్వం ఏం కోరుకోవాలి? ప్రజలందరూ విజ్ఞానవంతులు కావాలి, ఆలోచనాపరులు కావాలి, వివేకవంతులు కావాలి అని కోరుకోవాలి. జ్ఞానం అందరికీ సమానంగా దొరకాలి. జ్ఞానం నేర్చుకునేటటువంటి ప్రక్రియ మంచి నీళ్ళుతాగడం అంత సహజంగా, శ్వాస తీసుకోవడం అంత సహజంగా నేర్చుకోవడం జరగాలి. చుట్టూ ఉన్న సమాజం చైతన్యవంతంగా ఆలోచించాలి. మన జీవితాల్లో మన సామాజిక జీవితంలో ఉత్సాహం, ధైర్యం, విశ్వాసం తొణికిసలాడాలి. మన విద్యారంగం కోరుకోవాల్సింది ఇది.

మాతృభాషపై పట్టుసాధిస్తే ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు అనేది మనం పూర్వం నుండి గమనిస్తూ వస్తున్న అంశం. నేటి పరిస్థితి చూస్తే రెంటికీ చెడ్డ రేవడిలా తయారయింది. మన దగ్గర ASER మొదలైన సంస్థల నివేదికలో 56 శాతం మందికి మాతృభాషలో రెండవ తరగతి వాచకం కూడా చదవలేరు అని చెప్తోంది. గత 15–20 ఏళ్ల నుంచి మన అర్ధాంతరపు ఇంగ్లీషు మీడియం తరవాత వచ్చిన పరిణామాల్లో ఒక పిల్లవాడు తొమ్మిది పదితరగతుల్లోకి వచ్చిన తరువాత కూడా రెండవ తరగతి పుస్తకం చదవలేక పోతున్నాడు అంటే, చదవడం కూడా చేతకానివాడు విద్య, విజ్ఞానాల్ని ఎలా నేర్చుకుంటాడు అనేది మౌలికమైన ప్రశ్న. అంటే ఆ పిల్లవాడు భౌతికంగా 9 వతరగతిలో, మానసికంగా 2వ తరగతిలో ఉన్నాడు అని అర్థం.

మన చేతికి వచ్చిన పిల్లల్ని మొక్కలు అనుకుంటే ఈ మొక్కల్ని నీడనిచ్చే, ఫలాలు ఇచ్చే మహా వృక్షాలుగా తీర్చిదిద్దాల్సిన బదులు, పిల్లల్ని మరుగుజ్జు వృక్షాలుగా మారుస్తున్న వైనాన్ని మనం చూస్తున్నాం. పిల్లలవైపు నుండి ఆలోచిస్తే ఇదెంత పెద్ద విషాదమో ఎంత పెద్ద తప్పిదమో మనకు అర్థం అవుతుంది.

**“జాతి యొక్క గొప్పతనమంతా తన మాతృభాషను పోషించగల సామర్థ్యంలో ఉంది.”**

**– ఏపీజే అబ్దుల్ కలాం**

**5. మనం పిల్లల వైపు నుంచే ఎందుకు ఆలోచించాలి?**

**జవాబు:** 1. నేర్చుకునే దశ అనే బంగారు ప్రాయంలో ఉన్నది పిల్లలు. వాళ్ళ ఆలోచనలు, ఆశలు, వాళ్ళ ఊహలు అన్నీ చాలా స్వచ్ఛంగా నవనవలాడుతూ ఉంటాయి. ఆ దశలో వాళ్ళ మీద వాళ్ళకు అర్థంకాని భాషలో ప్రయోగాలు చేయడం తప్పు.

2. ఇవాళ మనకున్న అర్ధంతరపు అరకొర ఇంగ్లీషు మీడియంవల్ల ఒకవేళ చైతన్యవంతం కాని, వివేకవంతంతో పూర్తి వికాసం చెందని సమాజం ఏర్పడితే అది పిల్లలకు మాత్రమే నష్టం కాదు, మన దేశ భవిష్యత్తుకి నష్టం, సమాజంలోని తల్లితండ్రులకు, అందరికీ నష్టం. చక్కగా చదువుకుని వికసించే పిల్లలులేని సమాజం, అన్ని రకాల అవలక్షణాలకి లోనవుతుంది. పరాన్న భుక్కులుగా, శక్తిహీనులుగా ప్రజలు మారతారు. అందువల్ల మన పిల్లలు, అన్ని విద్యలు, అన్ని శాస్త్రాలు, అన్ని కళల్ని మనకు తెలిసిన భాషలోనే నేర్చుకోవడం హితం, సమ్మతం కూడా.

**6. మాతృభాషలో విద్యలేకపోతే సంస్కృతికి వచ్చిన ఆపద ఏమిటి?**

**జవాబు :** ప్రతి భాషలో సంస్కృతి అనేది మహా ప్రవాహం లాంటిది. ఒక మహాప్రవాహం ఎక్కడో కొండలలో కోనల్లో పుట్టి నడిచిన నేలంతా పచ్చదనాల్ని పంచిపెడుతూ వెళ్తుంది. అలాగే భాష కూడా తనతోపాటు తనలో ఆనాటి మానవులు మాట్లాడిన వినసొంపైన జాతీయాలు, నుడికారాలు, ఆత్మీయతలు అనుబంధాలు అన్నింటినీ మోసుకొచ్చి ఆ భాషను మాట్లాడే వాళ్ళందరి మధ్య సమానమైన బంధాలను పెంచుతుంది. ఒక్క 'మాట' అన్నపదం తీసుకుంటేనే, 'వాడు మాట మీద నిలబడతాడు', 'మాటంటే మాటే' , 'వాడికి మాట పట్టింపు ఎక్కువ' 'మాట కోసం ప్రాణమైనా ఇస్తాడు', ఇలా ఎన్నోరకాల వ్యక్తీకరణాలు వస్తాయి.

మన సంస్కృతిలో మన తాత తండ్రుల గురించి, వాళ్ళ జీవితాల్లో కష్టసుఖాల గురించి మన వీరుల గురించి మన విద్యల గురించి, మన కళల గురించి, మన శాస్త్రాల గురించి తెలియాలంటే మనం మాతృభాషలో చదువుసంధ్యలు ఉండాలి.

నేర్చుకోవడం అనే ప్రక్రియలో మాతృభాష పక్కకు జరిగిపోతే ఒక సబ్జెక్టుగా తెలుగు ఉన్నా నామమాత్రంగా ఒక నాలుగైదు పద్యభాగాలు, నాలుగైదు గద్య భాగాలతో ఒక పాఠ్య పుస్తకంగా మాత్రమే ఉంటుంది. అందువల్ల మన మాతృభాష పర్యావరణం చెక్కుచెదరకుండా ఉండాలంటే మన విద్య, విజ్ఞానాలు తప్పకుండా మాతృభాషలోనే ఉండాలి. మాతృభాష వెనక్కి జరిగిపోతే మన సంస్కృతి, చరిత్ర వెనక్కి జరిగిపోతాయి. మనం కేవలం సంస్కృతి కోల్పోయిన మనుషులుగా మిగిలిపోతాము. మనకున్న జాతి స్పృహను కోల్పోతాము, ఆఖరికి మన ఉనికి కూడా కోల్పోతాం. తెలుగు వాళ్ళు అని పూర్వం ఒక జాతి ఉండేది, వాళ్ళ భాష దేశభాషల్లోకల్లా గొప్పభాష. అయినా ఆ జాతి ప్రజల నిర్లక్ష్యంతో అద్భుతమైన తెలుగు భాష కనుమరుగయ్యింది అని భావితరాలు చెప్పుకొనే స్థితికి మనవాళ్ళు వస్తారు.

**7. విద్యా విజ్ఞానాలకు దూరమైన భాషలు ఇప్పుడు ఎలా నెమ్మదిగా అంతరిస్తున్నాయి?**

**జవాబు:** మాతృభాషలో విద్య అన్నప్పుడు సమస్త మాతృభాషల్లోనూ విద్య ఉండాలి. కొన్ని భాషలకి లిపిలేనందువల్ల పుస్తక రచనలాంటి ప్రయత్నాలు చాలా కాలం జరగలేదు. ఉదాహరణకి కోయ, గొండి మొదలైన భాషలు. అందువల్ల ఆ భాషలు మాట్లాడే వాళ్ళు కూడా వారి మాతృభాష కాని భాషలో నేర్చుకోవాల్సి వచ్చింది. ఫలితంగా విద్య, విజ్ఞానాలు నేర్చుకున్న కొత్తతరం ఇతర భాషలను నేర్చుకుని ఉపాధి కోసం బయటకు వెళ్లిపోతున్నారు. విద్య, విజ్ఞానాలపట్ల సంబంధం లేకపోవడంవల్ల ఆ భాషలు కేవలం మాట్లాడుకునే భాషలుగానే మిగిలిపోయినాయి. పాతతరం వాళ్ళు తప్పితే కొత్తతరంవాళ్ళకు ఆ భాష తెలియకుండా పోతోంది. పాత తరం వెళ్లిపోతే ఆ భాష మాట్లాడేవారి సంఖ్య క్రమంగా పడిపోయి అంతరించిపోయే భాషలలో చేరి పోతున్నాయి. మన దేశంలోనే ఇలా చాలా భాషలు నెమ్మదిగా కనుమరుగు అయ్యాయి. అందువల్ల మనం బడిలోనే నేర్చుకునే అన్ని విద్యలు, శాస్త్ర విజ్ఞానం మాతృభాషలోనే ఉంటే రెండు ప్రయోజనాలు కలుగుతాయి. ఒకటి, ప్రజలందరికీ జ్ఞానం కలుగుతుంది. రెండు, భాష పరిరక్షించబడుతుంది. లేకపోతే కేవలం ఇది ఇంట్లో పాతతరంవాళ్ళు మాట్లాడే ఇంటి భాషగా మారిపోతుంది. దాంతో భాష ఉనికి ప్రమాదంలో పడుతుంది.

**8. ఇంగ్లీషు–తెలుగు మాధ్యమాల యుద్ధం ఏమిటి ?**

**జవాబు :** నిజానికి ఇది చాలా మంది చర్చిస్తున్నట్టు ఇంగ్లీషు తెలుగు మాష్టర్ల మధ్య యుద్ధం కాదు. అది గొప్ప ఇది గొప్ప అన్న చర్చకాదు. అసలు చర్చించాల్సిన కీలకమైన సమస్య ఏమిటంటే, పిల్లలకు తరగతి గదిలో నేర్చుకోవడానికి అనువైన భాష ఏది అన్నది? ఏ భాష అయినా ఎలా వస్తుంది? మనం నివసించే భాషా వాతావరణం నుండి వస్తుంది. ఇంట్లో భాష తెలుగు, ఊర్లో భాష తెలుగు, బడిలో భాష మాత్రం వేరు. ఇలా ఉన్నప్పుడు పరభాషలో అభ్యసనం అర్థవంతంగా ఎలా కొనసాగుతుంది? ఇంత చిన్న లాజిక్ పెద్దలందరు మరచి పోయారు. ఇంట్లో మాట్లాడే భాషలో, అందరికీ తెలిసిన భాషలో, ఊరందరికీ తెలిసిన భాషలో నిత్యం నోట్లోనానే భాషలో సహజంగా సరళంగా నేర్చుకుంటే అలా నేర్చుకున్న జ్ఞానం మనకి పుష్టిని ఇస్తుంది.

మన నిత్య జీవితంలో మనం పప్పు, పులుసు, పెరుగు లాంటి పదార్థాలు తిన్నప్పుడు అవి పొట్టకి హితం అయినప్పుడు చక్కగా జీర్ణం అయ్యి మన రక్తంలో మనం గమనించేలోపే కలిసిపోతాయి. మన సర్వాంగాలకి బలాన్ని ఇస్తాయి.

తినేటప్పుడు తుష్టి, తిన్నాక పుష్టి మనకి కలుగుతాయి. ఇది మన నిత్యజీవిత అనుభవం. అలాగే తరగతి గదుల్లో మనం స్వీకరించే జ్ఞానం మొత్తం మన కర్థమైన మాటల్లో ఉంటే, మన చెవి, మన కన్ను, మన ముక్కు, మన మనస్సు అన్నీ ఏకోన్ముఖంగా పనిచేస్తాయి. పాఠం వింటున్నప్పుడు త్వరగా లీనమైపోతాము. మనం నేర్చుకున్న జ్ఞానం బుర్రకు ఎక్కుతుంది.

అది ఎంతలా అంటే, పూర్తిగా తెలుగు మీడియం చదువుకున్న పాత రోజుల్లో వాళ్లందరికీ ఒక్కసారి పాఠం వింటే అది సైన్స్ కావచ్చు, లెక్కలు కావచ్చు, సామాజిక శాస్త్రాలు కావొచ్చు విన్నవి విన్నట్టే గుర్తుండటం మనకు తెలుసు పరీక్షలప్పుడు ఒకసారి తిరగేసి రాయగలిగే వాళ్ళం మంచి ఆహారం మనకి తుష్టిని పుష్టిని ఇచ్చినట్టు.. మన మాటల్లో చదువు మనకి అద్భుతమైన ఆనందాన్ని, మనోవికాసాన్ని కలగచేస్తాయి. అందువల్ల విజ్ఞాన శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు, గణితం లాంటివి మాతృభాషలోనే బోధించాలని చెప్తున్నాం. అంతేకానీ, దీన్ని ఇంగ్లీషు భాషకన్న తక్కువని, ఎక్కువని వాదన ఇందులో తలఎత్తదు. అర్థంలేని చదువు వ్యర్థమని మనకందరికీ తెలుసు. పిల్లలకు అర్థంకాని భాషలో బోధించి తికమకపెట్టేకన్నా వాడిదైన భాషలో నేర్పితే ఆనందంగా అర్థవంతంగా నేర్చుకుంటాడు కదా! ఆలోచించండి!

**"మన భావాలను నిజంగా వ్యక్తం చేయగల భాష మన మాతృభాష మాత్రమే."**
**– లియో టాల్‌స్టాయి**

**9. ఇవాళ అన్ని దేశాలలోనూ ఇంగ్లీష్ ప్రధానం అయిపోయింది కదా ?**

**జవాబు :** అన్ని దేశాలు అన్నది నిజంకాదు గాని, చాలా దేశాలలో ఇంగ్లీషుని బోధిస్తున్న మాట నిజం. అందువల్ల ఇంగ్లీషు భాషనేర్చుకోవడం అనేది కీలకంకాదు అని ఎవరూ అనరు. నేర్చుకోవాల్సిందే. అయితే, ఆ నేర్చుకునే ఇంగ్లీషు ఏమిటి?ఎలా ఉండాలి? అనేది విచారిద్దాం.

ఇంగ్లీషుకు ఇంత ప్రాధాన్యత రావడానికి కారణాలు తెలుసుకుందాం...

1. ఒక మూడు నాలుగు దశాబ్దాల క్రిందట ఐరోపాఖండంలోని అనేక రాజ్యాలు అనేక దేశాలలో అనేక ప్రాంతాలను ఆక్రమించుకుని వలసలు స్థాపించుకుని పరిపాలనచేశారు. అందులో ఇంగ్లీషువాడిది పైచేయి అయ్యింది. అందువల్ల చాలా దేశాలలో పాలకులైన ఇంగ్లీషువారి ద్వారా విద్యా రంగంలోనూ, పాలనా రంగంలోనూ ఇంగ్లీష్ చోటు చేసుకున్నది.

2. ఐరోపాఖండంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం, విజ్ఞానశాస్త్ర అభివృద్ధి త్వర త్వరగా ఇంగ్లీషులోకి అనువాదం అయ్యి వలస దేశాలు అన్నింటిలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధి, ఇంగ్లీషునుంచి దిగుమతి అయ్యింది. నిజానికి శాస్త్ర సాంకేతిక రంగాలు మనకు ఇంగ్లీషులోంచి రావడం వలన, ఇంగ్లీషే సమస్తం అన్నట్టు కనపడుతోంది. శాస్త్ర సాంకేతిక రంగాలకి, భాషకి ప్రత్యక్ష సంబంధం లేదు.

3. 1990 తర్వాత వచ్చిన ప్రపంచీకరణ మార్కెట్ శక్తుల విజృంభణ మారిపోతున్న ఆర్థిక వ్యవస్థలు అన్నింటిలోనూ ఇంగ్లీషు ప్రధాన సంధాన భాషగా ఉన్న మాట కూడా నిజం.

ఇవి మూడూ ప్రధాన కారణాలవల్ల ప్రపంచమంతా ఏకమైపోతున్న ఈ సమయంలో మార్కెట్ శక్తులు సమస్తాన్ని శాసిస్తున్న సమాజంలో ఇంగ్లీష్ ఆవశ్యకత పెరిగింది. దాంతో ఇంగ్లీషే నేర్చుకోవలసిరావడం తప్పనిసరి పరిస్థితి అయ్యింది.

**10. ఇంగ్లీషు రావడం అంటే ఏమిటి? దానికి మార్గాలు ఏమిటి?**

**జవాబు :** ఏ భాషనైనా నేర్చుకోవడం అన్న మాట వచ్చినప్పుడు రెండు అంశాలు చూస్తారు. ఒకటి, భాషని చదువుతున్నప్పుడు వింటున్నప్పుడు అర్థం కావడం/ అవగాహన చేసుకోవడం. రెండోది చెప్పాలనుకున్న అంశాన్ని స్పష్టంగా సూటిగా చెప్పగలగడం. మొదటిదానిని comprehension అంటారు. రెండవదానిని expression అంటారు. వీటికి సంబంధించి శాస్త్ర సాంకేతిక విద్యలు నేర్చుకుంటున్నప్పుడు ఒక్క కాన్సెప్ట్ వివరిస్తున్నప్పుడు తప్ప తక్కిన విషయాల్లో అతి సాధారణమైన భాష ఉంటుంది. ఏ శాస్త్రానికి ఆ శాస్త్ర పరిభాషలు ఉంటాయి.

ఎంత బలమైన కాన్సెప్ట్‌నైనా అతి మామూలు పదాలలో మాతృభాషలో నేర్చుకోవచ్చు. ఈ విషయాన్ని NEP కూడా చెప్పింది. ప్రపంచంలో చాలామంది విద్యావేత్తలు కూడా తిరిగితిరిగి చెప్తున్నారు. ఒక సాధారణమైన ఇంజనీర్, డాక్టర్, టెక్నోక్రాట్‌కు, తన శాస్త్రం పట్ల ఎంత పరిజ్ఞానం ఉన్నది అన్నది చూస్తారు తప్ప ఆ వ్యక్తికి ఎంతగొప్ప ఇంగ్లీష్ వచ్చింది అనేది చూడరు. ఎంత అనర్గళంగా మాట్లాడగలడు అన్నది కూడా అనవసరం. విదేశాల్లో పనిచేయాల్సి వచ్చినప్పుడు కూడా మన టీంలో అన్ని దేశాలవాళ్ళు ఉన్నా, మనం మాట్లాడాల్సింది మాత్రం సాధారణమైన కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ మాత్రమే.

దీనికి ఉదాహరణగా మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారు, ఇన్ఫోసిస్ సుధామూర్తి గారు, ఇంకా సుందర్ పిచ్చాయి, ఎలాన్ మస్క్ వంటి వారి ఇంగ్లీషు

వింటే.. వాటిల్లో మనం స్పష్టంగా సరళమైన పదాల్ని, సంక్లిష్టత లేని వాక్య నిర్మాణాల్ని చూస్తాం. అంటే ఇక్కడ అర్థం కావాల్సింది ఇంగ్లీష్ మాట్లాడడం రావాలి కానీ దీని కోసం ఇంగ్లీషు మీడియంలో చదవాలని అనుకోవడం తప్పు. ఇంగ్లీష్ గొప్పది అని భావించేసి, బొడ్డు ఊడని శిశువు నుంచి పీజీదాకా ఇంగ్లీషు మీడియంలో చదివించాలి అనుకోవడం, అలా అయితేనే ఇంగ్లీషు వస్తుంది అనుకోవడం శుద్ధతప్పు. ఇది కార్యకారణ సంబంధంలేని విషయాలు.

**11. మరి మన పిల్లలకు ఇంగ్లీషు రావొద్దా? నిజంగానే ఇంగ్లీష్ మీడియంలో చదివితే ఇంగ్లీష్ వస్తుందా ?**

**జవాబు:** అవును తప్పకుండా రావాలి!! ఇంగ్లీషు రావాలంటే, ఇంగ్లీషు నేర్చుకోవాలి? ఇంగ్లీషుని ఇంగ్లీషుగా నేర్చుకోవాలి!! అంతేకాని ఇంగ్లీషు మీడియంలో అన్ని సబ్జెక్టులు చదివితే ఇంగ్లీషు వస్తుందని చెప్పలేం. ఇంగ్లీషు నేర్చుకోవడంవేరు, ఇంగ్లీషులో నేర్చుకోవడంవేరు. మన ఇంగ్లీషు విభాగంలో పనిచేసే చాలామంది ఉపాధ్యాయులకి ఇంగ్లీషు మాట్లాడడం రాదు.

కనీసం దినపత్రికలు, వారపత్రికలు వంటివి కూడా చదివే శక్తిలేని వాళ్ళు చాలా మంది తటస్థపడుతున్నారు. ఇప్పుడు ఇంగ్లీషు సబ్జెక్టుని బోధించే ఉపాధ్యాయులకు ఇంగ్లీషులో బోధించడానికి కావలసిన శక్తిసామర్థ్యాలు నైపుణ్యాలు లేవు. ఎవరికైనా వింటేనే కదా భాష వచ్చేది, మాట్లాడితేనే కదా భాష వచ్చేది. ఇంగ్లీష్ తరగతులలో ఈ రెండూ జరగడం లేదు. వీటి గురించి ఎవరూ ఆలోచించడం మానేశారు.

ఇది వదిలేసి ఇంగ్లీష్ మీడియంలో చదివితేనే ఇంగ్లీష్ మాట్లాడడం వస్తుంది అనే భ్రమలో తల్లిదండ్రులు ఉన్నారు. నేటి పరిస్థితులను గమనిస్తే ఇంగ్లీష్ నేర్చుకోవడానికి తగిన భాషా వాతావరణం కల్పించబడడం లేదు. ఆంగ్ల ఉపాధ్యాయులు పిల్లలతో ఇంగ్లీష్ మాట్లాడడం లేదు. వాళ్ళకే రాదు. పైగా పాఠాలు చెప్పడం కూడా సత్యనారాయణ వ్రతం కథలాగా ఉంటాయి. అందువల్ల పిల్లలకు ఒరిగేది ఏమి లేదు. కానీ, నిజమైన భాషబోధన అంటే ఉపాధ్యాయుడు సరళంగా సులభమైన ఇంగ్లీషులో మాట్లాడగలగాలి, పిల్లల్ని మాట్లాడించాలి. అందుకు అనువైన ప్రయోగాలు చేయడానికి వీలుగా (ఉదా : క్రికెట్ కామెంటరీలు, ఆడియో , వీడియో క్లిప్పులు) లాంటి సామగ్రిని వాడి ఆడుతూ పాడుతూ ఇంగ్లీషుని నేర్పేయవచ్చు.

ఇంకొక రహస్యం ఏమిటంటే, భాష ఉపాధ్యాయుడికి పాఠం కట్టే కొట్టే తెచ్చే అన్నట్టు ఉండదు. పాఠ్య పుస్తకంలోని పాఠం ఒక మిష మాత్రమే, సాకు మాత్రమే. భాషాబోధనలో పాఠం చుట్టూ పిల్లల అనుభవాలు, ఉపాధ్యాయుని అనుభవాలు

బోలెడంత అల్లుతూ చెప్పాలి. పిల్లలని ఒక ఊహా ప్రపంచంలోకి తీసుకెళ్లాలి. Test is only a pretext, But the whole context has to be built by imagery and expression. ఇలాంటి లక్షణాలు మన తరగతి గదుల్లో నిలువు కోత అడ్డుకోతల్లోనూ దొరకదు.

వీటన్నిటినీబట్టి ఏమి తెలుస్తుంది అంటే ఎక్కడో కొంతమంది మహానుభావులు చిత్త శుద్ధి కలిగినవారు కొంతమంది ఉపాధ్యాయులు తప్ప... ఎక్కువ మంది ఇంగ్లీషురాని, ఇంగ్లీషు బోధించడానికి శక్తి చాలని ఉపాధ్యాయులే ఉన్నారు. దీనివల్ల ఇంగ్లీషు బోధన బాధాకరమైన అనుభవంగా మారుతుంది. మన విద్యారంగంలో అతి బలహీనమైనది ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్. దీనిని బలమైన శక్తిగా రూపొందించడం తక్షణం చేయాల్సిన పని, అప్పుడు ఇంగ్లీషు మీడియంలో చదువుకోకుండానే ఇంగ్లీషు వస్తుంది. ఇంగ్లీష్ నేర్చుకోవడానికి మీడియం ముఖ్యంకాదు ఇంగ్లీష్ సబ్జెక్టు బాగా రావడం ముఖ్యం. ఇది అందరికీ తెలియాల్సిన విషయం. నేను ఇది స్వయంగా కలెక్టర్‌గా ఇంగ్లీష్ డిపార్టుమెంట్‌ని శక్తివంతం చేయడానికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. చేపట్టిన కార్యక్రమాలు కొనసాగాలి అంటే వాటిని ఎప్పటికప్పుడు మదింపు చేయాలి. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలి. ఆ ప్రయత్నం విశేషంగా చేయడం వలన చాలా సత్ఫలితాలు వచ్చాయి.

**"పిల్లలు మలచడానికి వస్తువులు కావు, వారు వికసించాల్సిన వ్యక్తులు."**
**– జస్ లేయర్**

**"మాతృ భాషలో పుష్కలమైన పదసంపద, పుష్టమైన ఆలోచనలకు దారి తీస్తుంది."**
**– డాక్టర్ అబ్దుల్ కలాం ఆజాద్**

**12. ఇంగ్లీషు మీడియం కావాలని ఎవరు కోరారు?**

**జవాబు :** ఇంగ్లీషు మీడియం కావాలని తల్లితండ్రులు కోరారు–కోరారు అని ప్రచారం జరుగుతోంది. అలా కోరటానికి కారణాలు ఏమిటి? అన్నది విశ్లేషిద్దాం. దేశంలో ఇంగ్లీషు మీడియం తల్లితండ్రుల నోటి మీద డిమాండ్‌గా రావడానికి ప్రధానకారణం ప్రభుత్వాల ప్రణాళికా రాహిత్యమే.

స్కూలింగ్ ఎలా చదివినా స్కూలు దశలో ఎంత బాగా చదివినా, మాతృభాషలో చదివినా మళ్ళా వృత్తి విద్యలలోకి వచ్చేటప్పటికి, ఉన్నత విద్యను కొనసాగించడానికి ఇంగ్లీష్ కావలసివస్తుంది. అప్పుడు ఇంగ్లీషు రాకపోవడం వల్ల, విద్యార్థులు చాలా అవస్థలుపడే వాళ్ళు. అభిమానంతో ఆత్మన్యూనతతో కుంగిపోయేవాళ్ళు. ఇది ఒక వాదం. దీన్ని సరిచేయడానికి, ప్రభుత్వం ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగు మీడియం

నుండి వచ్చే పిల్లల్ని బ్రిడ్జ్ కోర్స్ ఏర్పాటు చేసితీరాలి. అలాంటి ప్రయత్నం ఒక్కటి కూడా మచ్చుకు కనపడదు. అందువల్ల ఉన్నతవిద్యలో కొనసాగడం అన్నది దినదినగండం, నూరేళ్ళ ఆయుష్షుగా మారుతూ వచ్చింది. ఉన్నత విద్యలో వైఫల్యాలు (డ్రాప్అవుట్స్), కాలేజీలు మానేయడం పెద్ద ఎత్తున జరిగాయి. ప్రభుత్వం ఎందుకని బ్రిడ్జి కోర్సు బాధ్యత తీసుకోలేదు? అన్నది ఇప్పటికీ ఒక్కళ్లు సమాధానం చెప్పరు. ఈపాటి చిన్న పరిష్కారం కూడా చెప్పలేకపోతే తల్లితండ్రులు అలా ఆలోచించడంలో తప్పేముంది?

పి.వి.నరసింహారావుగారు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు, తెలుగు అకాడమీని స్థాపించి శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన పద సూచికలను (glossary) ప్రామాణిక గ్రంథాలను (standard texts) తెలుగులోకి అనువాదం చేసి, డిగ్రీ, పీజీ స్థాయివరకు పుస్తకాలను రూపకల్పన చేశారు. వాస్తవానికి ఇంటర్మీడియేట్, డిగ్రీకళాశాలలో కూడా తెలుగు మీడియం కోసం అధ్యయనం ఆరంభం అయ్యింది. నెమ్మదిగా తరువాత తరువాత ప్రభుత్వాలు వీటికి మంగళం పాడుతూ వచ్చాయి.

ఇప్పటికీ ఉన్నత విద్యతోబాటు సమస్తవిద్యలు చాలా దేశాలలో మాతృభాషలోనే అమలవు తున్నాయి. డాక్టర్లు, ఇంజనీర్లు వంటి వృత్తి విద్యానిపుణులు కూడా మాతృభాషలోనే చదువు కుంటున్నారు.

ఈ మధ్య కాలంలో మన ప్రధాని, విద్యాశాఖామంత్రి కేంద్రప్రభుత్వం వైపు నుండి ఉన్నత విద్యాలయాల్లోనూ వృత్తివిద్యాలయాల్లలో కూడా మాతృభాషా మీడియం ప్రవేశపెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ మేధావి వర్గంలో చిత్తశుద్ధి, సమాజంపట్ల ప్రేమ జీరోసైజులో ఉండటం వలన ఇంగ్లీషు సిక్స్ ప్యాక్‌గానే కొనసాగుతోంది.

ఈ మధ్యకాలంలో ఈ రంగంలో పనిచేస్తూ సమాజహితంకోరే కొంత మంది పెద్దలని ఉన్నత విద్యలో శాస్త్ర జ్ఞాన బోధన మాతృభాషలో చదవడం సాధ్యమేనా అన్న విషయం చర్చించి నప్పుడు, తప్పకుండా సాధ్యం, మరీ అందునా కృత్రిమ మేధ ప్రపంచం అంతా విస్తరిస్తున్న ఈ తరుణంలో మరింత సులభం. ఆడుతూ పాడుతూ చేయవచ్చు అని చెప్పారు. అయితే ఇది జరగాలంటే, అందరికీ ఉండాల్సింది చిత్తశుద్ధి.

తల్లితండ్రులు ఇంగ్లీషు మీడియం పడిపడీ అడుగుతున్నారు అని అంటున్నప్పుడు స్కూళ్లల్లో ఇంగ్లీషు డిపార్టుమెంట్లు చూస్తే అలా, ఉన్నత విద్య పరిస్థితి చూస్తే మళ్ళీ

ఇంగ్లీషే గతి అన్న పరిస్థితి ఉండటం వల్ల తల్లితండ్రులు ఇప్పటి నుంచే బుడ్డది/ బుడ్డోడిని ఇంగ్లీషులో చదివించేస్తే పోతుంది అనుకుంటున్నారు. ఇక్కడ మనం గమనించాల్సింది "ఇప్పుడు తల్లితండ్రులు కోరుతున్నారు కాబట్టి" అన్నది నిజం కాదు. వాళ్ళు కోరేటట్లు మనం చేశాం. కోరే పరిస్థితులను మనం కల్పించాం. వాళ్ళకు వేరే ఆప్షన్ లేకుండా చేసారు. ఒక తప్పుడు అభిప్రాయాన్ని సృష్టించి మాతృభాషలో చదువుకుంటే భవిషత్తు ఉండదనే భ్రమను సృష్టించాం. అందువలన ఈ నింద తల్లితండ్రుల మీద వేయకూడదు. ప్రభుత్వమే తన ఖాతాలో వేసుకోవాలి.

**13. మళ్ళీ తప్పు మీద తప్పు.. ఏమిటి? ఎలా?**

**జవాబు:** సర్కారువారు నడుపుతున్న బడులలో తెలుగు మీడియం నడుస్తున్నప్పుడు, ప్రభుత్వాలు ప్రైవేటు బళ్లకు ఎడాపెడా రికగ్నిషన్ ఇచ్చాయి. ఆ రికగ్నిషన్ ప్రకారం మామూలు ప్రభుత్వ బడికి వర్తించే నియమాలు నిబంధనలు ప్రైవేటు బడికి కూడా వర్తించాలి. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రాథమిక విద్యని మాతృభాషలోనే బోధించాలి అని చెప్తుంది. దానిని తూచా తప్పకుండా ప్రభుత్వ బడులలో అమలుచేసి, ప్రైవేటు బడులలో ఆ నియమాన్ని గాలికి వదిలేశారు. దాంతో ఇంగ్లీషు మీడియం బడులు కుప్పలు తెప్పలుగా పుట్టుకొచ్చాయి. చాలా మంది నిరక్షరాస్యులు, అర్ధాక్షరాస్యులతోనిండి ఉన్న ఈ దేశంలో పిల్లలు చూడ ముచ్చటగా ఇంగ్లీషు మాట్లాడుతూఉంటే, కన్నులపండుగగా ఉండే ఒక కృత్రిమ దృశ్యంలాంటిది ప్రైవేటు బడులు తీసుకువచ్చాయి.

ఆ బడిలో నేర్చుకోవడం అనే ప్రక్రియ ఎంత మాత్రం ఉందో తెలియదు కానీ, దాని ప్రభావం మాత్రం తల్లితండ్రులు ముచ్చటపడే అంత నాటకీయంగా ఉంటుంది. దీనివల్ల మనకి, ఇంగ్లీషు బడులు, తెలుగు బడులుఅని రెండుబడులుగా బయటకు కనపడినా, ఇంగ్లీషు బడులు గొప్పవి, తెలుగు బడులు పనికిరానివి అనే అంతరం సృష్టించబడింది. నిజానికి నాణ్యమైన విద్య ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత ఇటు ప్రభుత్వ బడిలోనూ, అటు ప్రైవేటు బడిలోనూ నాణ్యమైన విద్య ఏమిలేదు.

ఇక్కడ ప్రభుత్వం మళ్ళీ తప్పు మీద తప్పు చేసుకుంటూ పోయింది. ఒకటి, ప్రైవేటుబడులలో ఇంగ్లీషు మీడియం చట్టవిరుద్ధం అశాస్త్రీయం, పిల్లలకు అవగాహన దూరం చేస్తుంది. పిల్లలకు జ్ఞానాన్ని దూరం చేస్తుంది అన్న శాస్త్రీయ దృష్టితో సమస్యని చూడలేదు. మేమూ ఇంగ్లీషు మీడియం ఆరంభిస్తామని చెప్పడం చట్టవిరుద్ధం అశాస్త్రీయం కూడా. ఇంత తప్పులకుప్పలుగా విద్యారంగాన్ని నడిపి మళ్ళీ వీటన్నిటికీ ఇంగ్లీష్ మీడియం పరిష్కారం అని ఏకసూత్ర పరిష్కారం చెప్పడం, దాన్ని తల్లితండ్రుల మీద నెట్టివేయడం, ప్రభుత్వం చేసిన అభూతకల్పన.

**14. తల్లితండ్రుల చేత ఒక కాగితం పంపించి సంతకాలు చేయించి, తల్లితండ్రులు ఇంగ్లీషు మీడియం కోరారని గతంలో చెప్పడం ఎంత వరకు కరెక్టు.**

**జవాబు:** ఇది ఒక సర్వే రిపోర్టు అని పేర్కొంటున్న ఆకస్మిక పిడుగు పాటు సర్వే; 48 గంటల్లో మొత్తం అందరి తల్లితండ్రుల దగ్గర నుండి జల్లెడపట్టి సంతకాలు వచ్చేశాయి. ఈ సర్వేలో బాధ్యత కలిగిన అధికారవర్గం చేయవలసిన పని ఏమిటి? ఇక్కడ పిల్లల చదువులు సులభంగా నేర్చుకోవడం, తొందరగా నేర్చుకోవడం లాంటి ప్రయోజనాలు ఉన్న పిల్లల కోణంలో చెప్పాల్సిన అంశాలు. ఇంగ్లీషు వస్తే ఏయే ప్రయోజనాలు ఒనగూరుతాయో, ఇంగ్లీషులోనే సాధ్యం అవుతుంది అన్న నమ్మకం ఒకవైపు. ఈ రెండిటి మధ్య సాపేక్ష ప్రయోజనాలు చెప్పాలి. కష్టానష్టాలు చెప్పాలి. అప్పుడు మాత్రమే సంబంధిత తల్లితండ్రులు సమాచారం ఆధారంగా ఒక నిర్ణయం చేయాలి. దీన్ని మనం ఇన్‌ఫార్మ్‌డ్ చాయిస్ అంటున్నాం.

చిన్న పిల్లలకు రెండువేళ్లు ఇచ్చి ఏదో ఒక వేలు పట్టుకోమన్నట్టు, శాస్త్రం కోసం ఏదో ఒక సర్వే జరిపినట్టు ఉంది. దీనివల్ల ఎవరికి నష్టం జరిగింది అంటే పిల్లలకు అనేది ఒప్పుకోవాల్సిన విషయం.

**"పిల్లలు రేపు ఏమవుతారు అని మనం ఆందోళన పడుతాం, కానీ వారు నేడు ఎవరో మరచిపోతాం."**

**– స్టాసియా టౌచర్**

**15. పిల్లల గురించి వారి ఇష్టాలను గురించి, నేర్చుకునే విధానం గురించి తెలుసుకోకుండా అంత వరకు కొనసాగిన మీడియం నుండి ఒక్కసారిగా ఇంగ్లీషు మీడియంలోకి వారి ప్రమేయం లేకుండా మార్చేయడం ఎంత వరకు సబబు?**

**జవాబు:** రేపట్నించి మీరందరూ ఇంగ్లీషు మీడియంలో చదవబోతున్నారు అనడం, అదీ ప్రభుత్వం అనడం అశాస్త్రీయం, ధాష్టికం, ఒకరకమైన ఆధిపత్య నియంతృత్వం. ఇలాంటి విషయాల్లో అన్ని దేశాలలో విద్యారంగం విషయంలో ప్రభుత్వం తొందరపడి నోటికొచ్చిందల్లా చేస్తే సరైన నిర్ణయం అవదు. పైగా శాస్త్రీయం కానిది, చట్టబద్ధం కానిది ప్రభుత్వం అస్సలు చెప్పకూడదు. రాజకీయ లబ్దికోసం పిల్లలను బలి పశువులను చేసిన వింత సంఘటన ఇది.

**16. ఇలా మారిన పిల్లల్లో అభ్యసనం కుంటుపడుతుండటం చూస్తున్నాం– దీనికి ఎవరు బాధ్యత తీసుకుంటారు?**

**జవాబు:** ఎవరూ తీసుకోవడం లేదు. పిల్లల మానసిక స్థితి ఎవరికీ పట్టదు. రాత్రికి రాత్రే ఉన్నపళంగా అంతవరకు తెలుగు మీడియంలో చదివిన పిల్లలు ఇంగ్లీష్

మీడియంలో చదవాలి అనే చెప్పేసరికి పిల్లలు ఎదుర్కొన్న కష్టాలు అంతా ఇంతాకాదు. ఇంగ్లీష్ అంటే భయం ఉన్న పిల్లలు మొత్తం అన్ని సబ్జెక్టులు ఇంగ్లీష్‌లో చదవాలనేసరికి విపరీతంగా భయాందోళనకు గురైనవారు ఉన్నారు. ఏడ్చిన వాళ్ళు ఉన్నారు. కొంతమంది అయితే బడి మానేసిన వాళ్ళు ఉన్నారు. ఇక తప్పని పరిస్థితి వేరేదారి లేదు కాబట్టి అయోమయంగా తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెప్పేది అర్థం కాకపోయినా విధిలేని పరిస్థితుల్లో తరగతిలో కొనసాగినవారు ఉన్నారు.

ఇవన్నీ ఎవరు చేసిన పాపం? మంచిగా నేర్చుకోవాల్సిన దశలో వారికి ఇటువంటి గందరగోళ పరిస్థితులను సృష్టించడము పిల్లలు స్వేచ్ఛగా నేర్చుకోవడం కాలరాయడం కాదా? పిల్లలకు చదువురావడం లేదు. అది మనం అనడం లేదు. అసలు రెండవ తరగతి వాచకం కూడా చదవడం, రాయడం రానివాళ్ళు 56 శాతం మంది ఉన్నారు. మిగతావాళ్ళకు కూడా ఆయా శాస్త్రాలలో ఉదాహరణకి మ్యాథ్స్, సోషల్ స్టడీస్, బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్‌లో కాన్సెప్ట్ అర్థం కావడం లేదు. SCERT ఈ విపత్కర పరిస్థితి మీద ఒక్క పరిశోధనా చేయలేదు. పోనీ ASER/PISA లాంటి సంస్థలు మనం దిగజారిపోతున్న విద్య ప్రమాణాల గురించి అవమానకరంగా మాట్లాడుతున్నా శాస్త్రానికి కూడా, మన శాసనసభలోనూ, మన కలెక్టర్ల సమావేశాలల్లోనూ, క్యాబినెట్ మీటింగ్‌లోనూ ఎక్కడా చర్చించిన దాఖలాలు లేవు.

**17. మాతృభాషలో నేర్చుకుంటేనే వివిధ విషయ పరిజ్ఞానం అర్థం అవుతుంది. నేర్చుకోవడం సులభం అవుతుంది అని ప్రపంచం కోడైకూస్తుంటే దీనిని దృష్టిలో పెట్టుకోక పోవడంలో తప్పు ఎవరిది?**

**జవాబు:** విషయాన్ని పిల్లలకు తెలిసిన భాషలో... అంటే మాతృభాషలో చెప్పాలన్నది మొదటి నుంచి ఉన్న వాదం. విద్యారంగం ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. పైగా ఎటువంటి నిర్ణయాలు చేశారో చూద్దాం.

1. శాస్త్రీయతకు సంబంధం లేకుండా బుద్ధికి తోచింది చేయడం.
2. ప్రపంచ సంస్థలు UNESCO, UNICEF లాంటి సంస్థలు మాతృభాషలోనే విద్య ఉండాలని గొంతు చించుకుని చెప్పారు. అదీ పక్కన పెట్టడం.
3. తొలితరం మహానుభావులు, జాతి నిర్మాతలు–గాంధీ, సర్వేపల్లి, మదన్ మోహన్ మాలవ్యా, తదితరులు అందరూ మాతృభాషలోనే విద్య ఉండాలని చెప్పారు. అదీ పక్కన పెట్టారు.

4. మధ్య మధ్య విద్యా కమీషన్లు ఏర్పాటు చేసిన అన్ని కమీషన్లు, మాతృభాషలో విద్యను గురించి చెప్పాయి. అదీ పక్కన పెట్టారు..

5. విషయనిపుణులు (సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్) ఇవాళ్టికీ ఇదే విషయాన్ని చెప్పారు. అదీ పక్కన పెట్టాం.

6. మరి వ్యవస్థాపరమైన నిర్ణయాలు ఎవరు తీసుకుంటున్నారు? వేటి ఆధారంగా తీసుకుంటున్నారు? అంటే, నిరాధారంగా ఏ ఆధారం లేకుండా పాలనా యంత్రాంగాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి అనేది నేటి సత్యం.

**18. పేరుకే ఇంగ్లీషు మీడియం, ఇంగ్లీషు చదవడం లేదా రాయడం రాదు. అర్థం చేసుకోవడం కూడా రాదు. ఈ పరిస్థితిని ఎవరు చక్కదిద్దాలి?**

**జవాబు:** ప్రథమంగా, ప్రభుత్వానికి యంత్రాంగాలకి ఉండవలసింది, నిజాయితీగా సత్యాన్ని తెలుసుకోవాలని కోరిక ఉండటం. ఆ కోరిక అంటూ ఉంటే కొన్ని మార్గాలు లేక పోలేదు. ముందుగా ఒక ఎంట్రీ టెస్ట్ పెట్టాలి. ఎంత మంది పిల్లలు కనీసం రాయడం చదవడం వచ్చో వారికి మీడియం ఎంపికకు అనుమతించాలి. అదేమీ జరగలేదు. మరొక్క ఉదాహరణ విషయ నిపుణులతో క్షేత్రస్థాయి పరిశీలనలు జరపవచ్చు, కంట్రోల్ అండ్ ఆడిటర్ జనరల్ ద్వారా పర్ఫార్మెన్స్ ఆడిట్ చేయించవచ్చు. తల్లితండ్రుల సమావేశాలు నిక్కచ్చిగా జరపవచ్చు. దీనితో ఇంగ్లీష్ మీడియం డొల్లతనం బయటపడుతుంది. ఏం చేయాలన్నా ఉండాల్సిన సంకల్ప బలం, చిత్తశుద్ధి ఉండాలి.

పేరుకే ఇంగ్లీషు మీడియం అవడం వలన చాలాచోట్ల బట్టీపట్టి ముక్కున పెట్టుకుని పరీక్షలు రాసిపడేయటం, మాస్ కాపీయింగ్ మార్కులని పెంచేయడం లాంటి తప్పు విధానాలు చోటు చేసుకుంటున్నాయి. ఇవేవి తెలియని తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చాలా బాగా చదివేస్తున్నారని, బోలెడు మార్కులు వస్తున్నాయని భ్రమపడుతున్నారు. మార్కుల సంబరం వాళ్ళది. అర్థం చేసుకోలేని తికమక పరిస్థితి పిల్లలది.

**19. పోనీ ఇంగ్లీషు మీడియం చదివే పిల్లలకి మాతృభాష అయిన తెలుగు మీద అయినా పట్టు ఉందా?**

**జవాబు :** ఇది విద్యా వ్యవస్థలో వచ్చిన మరో విపరీత పరిస్థితి. చాలా ప్రైవేటుబడుల్లో కార్పొరేట్ బడుల్లో, తెలుగు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. చాలా మంది పిల్లలకి తెలుగు చదవడం రాదు. రాయడం సంగతి దేవుడు ఎరుగు. (తల్లితండ్రులకి ఇది ఒక గర్వ కారణం!!) కొంత మంది పిల్లలు అయితే తెలుగులో ఫెయిల్ అవుతున్నారు. వీటికి కారణాలు చూస్తే, ఒకటి, ప్రైవేటు, కార్పొరేట్ బడులలో

తెలుగుని సబ్జెక్టుగా చూడరు. వాస్తవానికి, తెలుగు ఉపాధ్యాయుడికి పీరియడ్లు కూడా కేటాయించరు. వారానికి ఒకటి లేదా రెండు పీరియడ్లు ఉంటే గొప్ప. అందువల్ల తెలుగుని నేర్చుకోవడం అనేది అక్కడ కేవలం తూతూమంత్రంగా జరుగుతుంది. దీని మీద ప్రభుత్వ పర్యవేక్షణ ఉండదు. అందువల్ల ఈ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ASER లాంటి సర్వే నివేదికలు, వీళ్ళకు చదవడం, రాయడం రావడం లేదు మహాప్రభో అంటుంటే మన రెండు తెలుగు రాష్ట్రాలలో ఇదేమిటి అని అడిగేవారు ఎవరూ ఉండరు. శాసనసభలు/శాసనసభా కమిటీలు, వార్తా మాధ్యమాలు ఏవీ తెలియనట్టు ఊరుకుంటాయి. ఎవరికీ ఇది ప్రశ్నే కానప్పుడు జవాబుదారీతనం ఆశించేది ఏముంది?

**20. మన భాషపోతే మన సంస్కృతి సంప్రదాయాలు కూడా కనుమరుగు అవుతాయి. దీన్ని కాపాడే ప్రయత్నం ఎవరు చేయాలి?**

**జవాబు:** అవుతోంది !! కనుమరుగు అవుతోంది!! మనం కనులారా చూస్తుండగానే మన సంస్కృతి కనుమరుగు అవుతోంది.

ఇవాళ మన తెలుగు మహాపురుషులు మనకు తెలియదు.

మన తెలుగు జాతి నిర్మాతలు మనకు తెలియదు,

మన తెలుగు మహాకవులు మనకు తెలియదు,

మన తెలుగు కళారూపాలు మనకు తెలియవు,

మన గ్రామసీమల్లో వృక్ష, పక్షి, మృగజాతుల పేర్లు మనకు తెలియవు.

మన దేవాలయాల పేర్లు తెలియవు.

ఇంట్లోవాడే పాత్రల పేర్లు తెలియవు,

బంధువుల వరసలు తెలియవు.

బ్రతికేయాలన్న తాపత్రయంలో ఎలా చితికిపోతున్నామో మనకు తెలియడం లేదు.

దీన్ని ఎవరు మార్చాలి?

అధికారం ఉండి , ఈ పరిస్థితిని మార్చగలిగిన శక్తి ఉన్నవాళ్ళేమో దీని విలువ నాణ్యత తెలుసుకోవడం లేదు. దీన్ని మార్పు చేయగలిగిన శక్తి సామర్థ్యాలు ఉన్నవాళ్ళకేమో అధికారం లేదు. మామూలు జనానికి పట్టించుకునే సమయం, శక్తిలేవు. దేశం బాగుండాలి. సమాజం బాగుండాలి, అందరూ బాగుండాలి. బలంగా ధైర్యంగా శిరస్సు ఎత్తుకుని నిలబడాలి లాంటి స్వప్నాన్ని కనేందుకు కళ్ళు కరువయ్యాయి. దేశ జనాభా అంటే నేను, నా భార్య, పిల్లలు అనుకునే రోజులు వచ్చాయి. అందువల్ల మన పిల్లలు మార్కులు తెచ్చుకోవడం, సీట్లు సంపాదించుకోవడం, డాలర్లు ఆర్జించడం జరుగుతున్న సమాజంలో వ్యక్తులుగా, దేశంలో

పౌరులుగా మారడంలో చాలా ఇబ్బంది పడుతున్నారు. యుగయుగాలుగా తట్టుకుని నిలబడిన కుటుంబం, ఊరు, వీటిని కాపాడే నైతిక సూత్రాలు ఇవన్నీ నెమ్మదిగా పక్కకి వెళ్లిపోతున్నాయి. అందువల్ల ఎటుచూసినా ఒకరకమైన అశాంతి, అభద్రత, కుంగుబాటు మన వెంట పడుతున్నాయి.

**"మాతృభాషలో నైపుణ్యం సాధించడం నిజమైన విద్యకు పునాది."**

**– రవీంద్రనాథ్ ఠాగూర్**

## పిల్లల అభ్యసనం ఎందులో సులభం?

**21. అసలు పిల్లలు నేర్చుకోవడం అనే ప్రక్రియలో ఏయే అంశాలు దోహదపడతాయి అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా బలవంతంగా మీడియం రుద్దడం ఎవరి గొప్ప కోసం?**

**జవాబు :** జనాకర్షణ పథకాలు రాజ్యమేలే రోజులలో ఏ విషయాన్నైనా జనాకర్షణ కోసం చెప్పడం అలవాటైపోయింది. అందువల్ల ఈ మధ్య ప్రముఖ సెఫాలజిస్టు (ఎన్నికల వ్యూహకర్తలు) ఆయా పార్టీల ప్రభుత్వాల వ్యూహకర్తలు దీనిని ఎలక్షన్ అజెండాగా మార్చి ఒక అందమైన కలలాగా దీనిని అమ్మడం (నమ్మించడం) కూడా ఆరంభించారు. 1980 వరకు ప్రతి పార్టీ విధాన నిర్ణయాలకు సంబంధించి ఇది అని స్పష్టంగా నిర్ణయాలు చేసేవాళ్ళు. కానీ ఇప్పుడు మొత్తం అన్ని పార్టీలు ఎన్నికలలో లాభమా–నష్టమా అన్న ఒకే ఒక్కకోణంలో చూస్తున్నారు. అందువల్ల పిల్లలకి నేర్చుకోవడంలో మాతృభాష విషయంలో ఏ పార్టీలోనూ చర్చ జరగడంలేదు. ఏ పార్టీకైనా పరమార్థం అధికారం సంపాదించడమే. అందువల్ల దీని మీద విస్తృతంగా పార్టీ స్థాయిలోనూ ప్రభుత్వ స్థాయిలోనూ చర్చ ఎక్కడా జరగడం లేదు. అసలు చర్చ చేద్దామనే ఊసే లేదు.

**"తమ మాతృభాషకు గౌరవం ఇచ్చే వ్యక్తి తన వంశానికి గౌరవం ఇస్తాడు."**

**– గురజాడ అప్పారావు**

**22. చదవవలసిన పిల్లలు ఏ మీడియంలో చదవాలి అన్నది వాళ్ళు ఎంచుకునే అవకాశం ఇవ్వాలికదా! ప్రభుత్వాలు, తల్లితండ్రులు, పిల్లల ఇష్టాలను, వాళ్ళ అవగాహనను పరిగణలోకి తీసుకోకుండా నిర్ణయాలు చేయడం సబబేనా?**

**జవాబు :** మొత్తం ప్రపంచం అంతా విద్యారంగానికి సంబంధించి పిల్లల్ని కేంద్రస్థానంలో ఉంచి మాట్లాడుతున్నాయి. (child centric) ఏ నిర్ణయమైనా ఏ ఆలోచన అయినా పిల్లలకోణంలో చూడాల్సిన అవసరం ఉంది. ఒక పిల్లవాడు/

పాపాయి తమ జీవితాలమీద తమ బాగోగుల మీద తామే చూసుకోగలరు అన్న నమ్మకంతో చదివిస్తేనే ఆ చదువు వాళ్ళని శక్తివంతులుగా తీర్చిదిద్దుతుంది. దీనికి ఒక చిన్న ప్రయోగం నేను స్వయంగా చేశాను. పిల్లల పాఠ్య ప్రణాళికలో లేని అంశాలను ముఖ్యంగా కొత్త కాన్సెప్ట్స్ తీసుకుని చక్కని తెలుగులో అర్థమయ్యేటట్లు పరిచయం చేయడానికి ప్రయత్నం చేశాను. దాంట్లో తెలుగు మీడియం, ఇంగ్లీషు మీడియంతో సంబంధం లేకుండా అందరూ పిల్లలు ఒకేరకంగా గ్రహించారు. కొంచెం మందంగా ఉండే పిల్లలు కూడా బాగా స్పందించారు. వివేకానంద పిల్లలకు చదువుని గురించి చెప్తూ ఒక గొప్ప మాట చెప్పాడు

**" మీరు పిల్లలకు బోధించగలను అనుకుంటున్నారా? మీ వల్ల కాదు!! పిల్లవాడు తనకు తానే చెప్పుకోగలడు. మీ పనల్లా అతనికి అవకాశాలు ఇవ్వడం, అవరోధాలు తొలగించడం.."**

ఐన్ స్టీన్ కూడా ఒక గొప్ప మాట చెప్పాడు

**"నువ్వు ఒక విషయాన్ని ఆరేళ్ల పిల్లవాడికి గనుక అర్థమయ్యేలా చెప్పడం చేతకాకపోతే, అది నీకు కూడా అర్థం కాలేదు అని అర్థం".**

ఇవి రెండూ ఆలోచించినప్పుడు పిల్లల కోసం చెప్పే చదువు పిల్లలకు అర్థమయ్యే మాటల్లోనే ఉండాలి అనే మాట మనకు బోధపడుతుంది.

ఇవాళ వందల మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో కూడా నేరుగా పరీక్షిస్తే ఇరవై శాతం మంది కూడా చదవటం రాయడం చేయలేకపోతున్నారు. ఈ తీరు ఇలానే ఉంటే ముందు ముందు ఎటువంటి పిల్లల్ని మనం నిజంగా తయారు చేస్తున్నట్టు.

ఒక పక్క ASER, PISA వంటి సంస్థలు చదవడం, రాయడం రావడంలేదు అని అంటుంటే మరొకపక్క పిల్లలు రాసిన పరీక్షల పేపర్లు చూసినప్పుడు అక్షరదోషాలు, వాక్య నిర్మాణ దోషాలు అసమాపక వాక్యాలు కొల్లలుగా కనపడుతాయి. వాస్తవానికి ఒక విద్యార్థికి ఇవ్వవలసిన మార్కులకన్నా ఎక్కువ దానకర్ణులై మార్కులు వేయడం జరుగుతోంది. వీళ్లందరూ ముందు ముందు పౌరులైనప్పుడు దేశానికి గొప్ప మానవవనరులు కావలసినవాళ్ళు. ఇలాగే కొనసాగితే వాళ్ళు గొప్ప భారం కూడా కావొచ్చు. సమాజంలో సామాజిక సంబంధాల్లో సామరస్యం తగ్గిపోవచ్చు, ఎదుగుతున్న ప్రతి పిల్లవాడు పౌరుడై తనకు తాను బాధ్యుడుగా సమాజానికి

సమాజంలో ఒక మంచి సభ్యుడుగా దేశానికి ఒక గొప్ప ఆస్తిగా కావాల్సిన వాళ్ళు అలా కాకుండాపోతే ఇదంతా నిర్లిప్తంగా చూస్తున్న మనందరిదీ తప్పు. ఇది భవిష్యత్తులో సరిచేసుకోలేని తప్పుగా పరిణమిస్తుంది.

**“విద్య ప్రపంచాన్ని మార్చుడానికి మీకు ఉపయోగపడే అత్యంత శక్తివంతమైన ఆయుధం.”**

**– నెల్సన్ మండేలా**

**23. తమదికాని భాషలో అర్ధంచేసుకోవడం అనేది చాలా కష్టతరమైనపని. అలాంటిది తమదికాని భాషలో చదువుకోవడం మరింత కష్టం –పిల్లల మీద, వాళ్ళకి సంబంధంలేని భాషని మీడియంగా రుద్దడం వాళ్ళ హక్కులని కాలరాచినట్టే కదా?**

**జవాబు :** విద్యా హక్కుచట్టం (RTE) అన్నది రాజ్యాంగంలో కొత్తగా చేర్చిన ఆర్టికల్ 21(a) ఆధారంగావచ్చింది. ఈచట్టం ఉద్దేశ్యం విద్యని అతి సామాన్యుడికి కూడా చేరువ చేయాలని. బడి అనే కట్టడం దగ్గర కావడమే కాకుండా బడి మానసికంగా కూడా దగ్గర కావాలంటే అది పిల్లల మాతృభాషలోనే ఉండాలి. అందుకనే, విద్యా హక్కు చట్టం (RTE)లో సెక్షన్ 29, మాతృ భాషలోనే ప్రాథమిక విద్య ఉండాలని చెప్తూ పిల్లవాడు నేర్చుకోవడానికి ఎలాంటి పరిస్థితులు ఉండాలో చెప్పింది. అవన్నీ కూడా మనం అంటున్నట్టు సహజమైన, స్వచ్ఛమైన పర్యావరణంలోనే పిల్లలు చదువుకోవాలని చెప్తాయి. మాతృభాష కాకుండా పరాయి భాష అన్నప్పుడు పిల్లలు ఎక్కువ ఒత్తిడికి గురవుతారు. నేర్చుకోవడం అన్నది బాధాకరమైన, కష్టతరమైన అనుభవం కాకూడదు అని RTE చెప్తోంది. అది అనుక్షణం ఉండాల్సినప్పటికీ చట్టంలోని ఈ నిబంధనని పట్టించుకునే నాధుడే లేడు.

**24. మాతృభాషలో విద్య బోధనను గురించి NEP ఏమి చెప్పింది?**

**జవాబు :** ఎంత జఠిలమైన విషయాలైనా పిల్లలు మాతృభాషలో అయితే సులభంగా నేర్చుకుంటారు. మాతృభాషని అయిదో తరగతి వరకు, వీలైనంత వరకు ఎనిమిదవ తరగతి వరకు మాతృభాషలోనే విద్యాబోధన ఉండాలి. ఈ సూత్రం ప్రైవేటు స్కూళ్ళకి పబ్లిక్ స్కూళ్ళకి వర్తిస్తుంది. సైన్స్‌తో సహా అన్ని పాఠ్య పుస్తకాలు మాతృ భాషలోనే లభ్యం అయ్యేటట్టు చర్యలు తీసుకోవాలి. పిల్లవాడి మాతృభాషకి, తరగతి గదిలో భాషకి తేడా ఉండేటట్టు అయితే (ఉదాహరణకి:గిరిజన ప్రాంతాలు మొదలైనచోట) బోధనలో అంతరాన్ని తగ్గించాలి. ఒకవేళ కొన్ని మాతృ భాషలకి సంబంధించి పుస్తకాలు లభించనప్పుడు క్లాసు రూమ్‌లో బోధన మాత్రం మాతృ భాషలోనే ఉండాలి. (ఇది కూడా గిరిజన ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని చెప్పినట్టు

ఉంది). అన్ని భాషలను అత్యధిక నాణ్యతతో బోధించాలి. ఏదైనా ఒక భాషలో భాష ప్రావీణ్యం రావడానికి అది తప్పకుండా మీడియం అయ్యి ఉండాలి అన్న విషయాన్ని జాతీయ విద్యావిధానం అంగీకరించదు (బహుశా ఇది ఇంగ్లీషు మీడియం గురించి).

**25.నిజంగా ఇంగ్లీషు మీడియంలోనే చదివితే పిల్లలకి భవిష్యత్తులో ఉపాధి కల్పించబడుతుందా, అలా అని హామీ ఏమైనా ఉందా?**

**జవాబు :** ఉపాధి అంటే డాలర్ల ఉద్యోగాలు మాత్రమే కాదు, సర్వీస్ సెక్టార్‌లో అతి సాధారణమైన కార్పెంటర్ నుంచి ప్రత్యేక నైపుణ్యాలు ఉన్న నర్సెస్ హౌస్ కీపింగ్, హొటల్ మేనేజ్‌మెంట్ టూరిజం లాంటి నైపుణ్య విద్యలు, సాంస్కృతిక, పర్యాటక రంగాలలో వందలాది ఉద్యోగ అవకాశాలు దేశంలోనూ బయట ఉన్నాయి, వీటిలో అత్యంత మైక్రోస్కోపిక్ స్థాయిలో మాత్రమే ఐటీ రంగ ఉద్యోగాలు ఉన్నాయి. ఆ ఉద్యోగాలలో కూడా ఇంగ్లీషు స్పీకింగ్ స్కిల్స్ ప్రత్యేకమైన తరహాలో కావాలి. దాని కోసం, బ్రహ్మాండమైన ప్రయత్నాలు నర్సరీ తరగతి నుండి పీజీదాకా చేయాల్సిన అవసరం లేదు. ఇంకా హాస్పిటల్ మేనేజ్‌మెంట్, హౌస్ కీపింగ్ లాంటి ఉద్యోగాల్లో కూడా అతి సరళమైన, పరిమితమైన ఇంగ్లీషు శిక్షణా కార్యక్రమాలు, టైలర్ మేడ్‌గా వండి వార్చడానికి సిద్ధంగా ఉన్నాయి. దీనికోసమని మనం నేర్చుకునే ప్రతి సబ్జెక్ట్ గోళం నుండి ఖగోళందాకా అన్ని శాస్త్రాలు ఇంగ్లీషులోనే చదవనక్కర్లేదు.

సబ్జెక్టు వేరు కమ్యూనికేషన్ వేరు. ఈ కాలంలో ఇంజనీరింగ్‌లో మంచి టాప్ మార్కులు తెచ్చుకున్నా వారు కూడా కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేక ఉద్యోగాలు తెచ్చుకోవడంలో వెనుకబడుతున్నారు. ఇక్కడ అర్థం కావాల్సింది కమ్యూనికేషన్ ఇంగ్లీష్ సబ్జెక్టులు ఇంగ్లీష్ మీడియంలో చదవడానికి సంబంధం లేదు అని. ఇంగ్లీష్ మీడియంలో చదువుకుంటేనే మన జన్మలు తరిస్తాయి మనం బాగుపడతాం అనుకునేది ఒక పెద్ద బెలూన్ కల. ఇప్పటికైనా మనం బాగుచేసుకోవాల్సింది విద్యావ్యవస్థలో ఇంగ్లీష్ డిపార్టుమెంట్ని, ఇంగ్లీష్ డిపార్టుమెంట్లు కూడా కమ్యూనికేషవ్ ఇంగ్లీష్, ట్రాన్ సాక్షానల్ ఇంగ్లీష్, టైలర్ మేడ్ కోర్సెస్ తయారు చేసుకోవాలి.

ఇంకొక విశేషం ఏమిటంటే, TOEFL, IELTS లాంటి పరీక్షల్లో ఇంగ్లీషు మీడియం నేపథ్యం నుండి వచ్చిన పిల్లల స్కోర్స్ సమానంగా తెలుగు మీడియం పిల్లలు కూడా పొందటం ఒక్కొక్కసారి తెలుగు మీడియం పిల్లలే ఎక్కువ స్కోర్ చేయడం మనం చూస్తుంటాం. కాబట్టి ఇంగ్లీషు అనేది ఒక భాష సంబంధమైన నైపుణ్యం, అది ఎంత చక్కగా నేర్చుకుంటే, అంత చక్కగా వస్తుంది అనేది ఇప్పటికైనా మనం తెలుసుకోవలసిన సత్యం.

**26. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ఆంగ్ల భాషకు ఉన్న సామర్థ్యం దేశీయభాషలకు లేదు కదా?**

**జవాబు :** అన్ని జీవభాషలకి ఉండే ప్రధానమైన లక్షణం కొత్త పదాలను స్వీకరించడం, కొత్త పదాలను రూపొందించడం, ఈ శక్తి ఇంగ్లీషు భాషలో విశేషంగా ఉందని చెప్తారు. అందువలనే ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ప్రతి సంవత్సరం కొత్త పదాలతో ముందుకు వస్తుంటుంది. అంతకు ఏమాత్రం తీసిపోని శక్తి తెలుగుకు కూడా ఉంది.

ఉదాహరణకు కొన్ని పదాలు కేవలం కించిత్ ధ్వని వాక్కుతో తెలుగులోకి వచ్చేశాయి. రోడ్డు, కోర్టు , బస్సు, కారు ఇవన్నీ కూడా తెలుగు పదాలుగానే చూస్తాం. కొన్ని పదాలు కొంచెం శబ్ద మార్పిడితో, కొన్ని పదాలు నూతన రూపకల్పనతో తెలుగులోకి వచ్చాయి. అలా సమస్త భాషలలో పదాలని తనదైన శైలిలో స్వీకరించి నిలుపుకునే శక్తి ఉన్న భారతీయభాషలలో ముఖ్యంగా దక్షిణాదిభాషలలో తెలుగు ముందు స్థానంలో ఉన్నది. అందువల్ల మనం ఆంగ్లభాషకు ఏమాత్రం తీసిపోము అని చెప్పవచ్చు.

**27. NRIల పిల్లలు పుట్టినప్పటి నుండి ఆంగ్లంలోనే చదువుకుంటూ విజ్ఞానాన్ని సంపాదించి ఉద్యోగాలు పొందడం లేదా? అదే పరిస్థితి ఇక్కడకూడా ఉంటే తప్పేమిటి?**

**జవాబు :** NRI ల పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటున్నారు అంటే ఆ ప్రాంతానికి అది మాతృభాష కాబట్టి. ఉన్నతోద్యోగాలు పొందటం వ్యక్తిత్వ నిర్మాణం మొదలైన అంశాలు అక్కడుండే విద్యారంగాన్ని నిర్వహించే తీరుతెన్నుల మీద ఆధారపడుతుంది. అంతేకానీ, వాళ్ళు NRI లు కాబట్టి అక్కడ ఇంగ్లీషులో చదువుకున్నారు కాబట్టి గొప్పవాళ్లు కాదు. ఉదాహరణకు, నోరి దత్తాత్రేయుడు క్యాన్సర్ రంగంలో, యల్లాప్రగడ సుబ్బారావు ఔషధ రంగంలోనూ, డా. నాయుడమ్మ మొదలైన వారందరూ ఈ దేశ మూలాల నుండి వచ్చినవాళ్లే. ఇంకా ముందుకు వెళితే చంద్రశేఖర్ వెంకటరామన్, మరింత ముందుకు వెళ్తే జగదీష్ చంద్రబోస్ లాంటి శాస్త్రవేత్తలు కేవలం, దూరభూముల్లో NRIల మధ్యన చదువుకోలేదు. వాళ్ళు కూడా ప్రపంచ ప్రసిద్ధులే.

**28. ప్రపంచ స్థాయిలో మాతృభాషలో చదువు కొనసాగించి అభివృద్ధి పథంలో నడుస్తున్న దేశాలు ఉన్నాయా? ఇంగ్లీషు కనీస అవసరం లేకుండానే ఏ దేశమైనా పైకి వచ్చిందా?**

**జవాబు :** మన దగ్గర మన నాయకులు చాలా మంది పోటీపడి మన ఇంగ్లీషు పరిజ్ఞానం మనల్ని ప్రపంచస్థాయిలో గొప్ప వాళ్లుగా నిలబెడుతోందని చెప్తుంటారు.

ఇంగ్లీష్‌కి తెలివితేటలకు సంబంధం ఉందని కూడా చెప్తూ ఉంటారు. ఎవరైనా ఇంగ్లీషులో పెళపెళలాడిస్తే అతని పరిజ్ఞానానికి సబ్జెక్ట్‌తో సంబంధం లేకుండా ముగ్ధులమవుతాం. ఈ ఉదాహరణ చూడండి... గోవా బీచ్‌లో పూసలు అమ్ముకునే పిల్లలు చక్కని ఇంగ్లీషు మాట్లాడతారు. వాళ్ళు ఎప్పుడూ బడి ముఖం చూడని వాళ్ళు. భాష అవసరం వారిని నేర్చుకునేలా చేసింది. మన విద్యారంగంలో ఉన్న సమస్త సమస్యలకి ఏకైక పరిష్కారం, సమాధానం ఇంగ్లీషులో ఉన్నదని మనల్ని నమ్మింపచేసారు. మనం కూడా చాలా ఇష్టపడి నమ్ముతాం. కానీ, ఇప్పుడు నేను రెండు దేశాలను గురించి ప్రస్తావించ దలుచుకుంటున్నాను, ఆ రెండు దేశాలలో ఇంగ్లీషు స్పర్శ దాదాపు లేదనేచెప్పాలి. తప్పనిసరి అయితేనే ఉదాహరణకు విదేశీ విద్యార్థుల విషయంలో తప్పితే ఇంగ్లీషుని వాడరు. ఆ రెండు దేశాల గురించి తెలుసుకుందాం.

**మొదటగా, జపాన్ దేశాన్ని ఉదాహరణగా తీసుకుందాం.**

ఆసియా ఖండంలో ఓ చిన్న ద్వీపాల సమూహం ఈ దేశం. రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో జపాన్‌లోని హీరోషిమా మీద అమెరికా బాంబులు వేసినప్పుడు, భస్మీపటలమైన నగరం ఇవాళ సుసంపన్నమైన మంచి సువ్యవస్థితమైన ఆర్థిక శక్తిగా ఎదిగింది. అది తిన్న చావుదెబ్బకు మళ్ళీ కోలుకునే అవకాశమే లేదనిపించింది. ఎంత కఠినమైన ప్రశ్నకైనా పరిష్కారం ఉండి తీరుతుంది అన్న నమ్మకంతో జపాన్ దేశం...అటు ప్రభుత్వం ఇటు ప్రజలు పనిచేస్తారు. ఎంతటి పతనాన్నైనా తట్టుకుని నిలబడి మళ్ళా పునర్నిర్మాణం చేసుకోవడం జపాన్‌కి వెన్నతోపెట్టిన విద్య. భూకంపాల మధ్య కూడా స్థిర జీవనం ఎలా చేయవచ్చో భూకంపానికి భయపడి లొంగిపోకుండా వారి జీవన విధానాన్ని, ఆలోచనా శైలిని మార్చుకున్న జపాన్ దేశపు విద్యావిధానాన్ని పరిశీలిద్దాం.

**జపాన్ విద్యా విధానం మనకు ఒక మేల్కొలుపు**

జపాన్ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అందరికీ చదువుని అందించడంతోపాటు ఆ చదువు కూడా మరింత ప్రజాస్వామ్యబద్ధంగా ఉండేలా జాగ్రత్త పడింది. జపాన్‌లో తొమ్మిది సంవత్సరాలు నిర్బంధంగా చదివి తీరాల్సిందే. చదువుతోపాటు అన్ని రకాల పనీపాటలని చిన్నప్పుడే నేర్పుతారు. అందువల్ల ప్రతి పనీ గొప్పదే, ఏ పనిని తక్కువగా చూడకూడదు అన్న భావన జపాన్‌లో చిన్న పిల్లలప్పుడే ఏర్పడుతుంది. మన దేశంలోలాగా రైతు ఇంట పుట్టిన కొడుకు, మట్టిపిసుక్కు బతకాలా అని రైతు చేసే పనిని తక్కువగా, తాలూకు ఆఫీసు గుమాస్తా

పని గొప్పదిగా భావించేటటువంటి వలస మనస్తత్వం అక్కడ ఉండదు. ఎందుకంటే, జపాన్ విద్యావిధానం శ్రమని నమ్ముతుంది. అన్ని పనులు గొప్పవి అంటుంది.

జపాన్ దేశంలో స్టెమ్ చదువులుకి అతిగా ప్రాధాన్యత ఉంది. వీటితోపాటు వాటిని ఆ దేశంలోని పరిశ్రమలకు సాంకేతిక అవసరాలకు అనుగుణంగా వాళ్ళ విద్యావ్యవస్థని తీర్చిదిద్దుతారు. అలాగే జపాన్‌లో ప్రత్యేకంగా మాన్యుఫ్యాక్చరింగ్, రోబోటిక్స్, ఐటీ రంగాలకు సంబంధించిన ప్రత్యేక పరిజ్ఞానం ఉన్న వ్యక్తులకి ప్రత్యేక యూనివర్సిటీలు స్కూళ్ళు ఉన్నాయి

**పరిశ్రమలు, విద్యాలయాలు కలిసి పనిచేసే విధానం**

జపాన్ పరిశ్రమలలో నూతన ఆవిష్కరణలు, ఆర్థిక ఉత్పాదకత కోసం ప్రత్యేకమైన చదువులు ఉన్నాయి. జపాన్‌లో ఇంకొక విశేషం ఏమిటంటే పరిశ్రమలు విశ్వవిద్యాలయాలు కలిసి పనిచేస్తాయి. విశ్వవిద్యాలయాలు పరిశ్రమలకి కావలసిన నైపుణ్యం ఉన్న వ్యక్తులని శిక్షణనిచ్చి పంపుతారు. అలాగే పరిశ్రమలలో ఉత్పాదకతని పెంచడానికి కావలసిన నూతన ఆవిష్కరణలకోసం ప్రత్యేకమైన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాలు పనిచేస్తాయి. ఆ దేశంలో రీసెర్చ్ ఇన్నోవేషన్ అగ్రతాంబూలం. జపాన్‌లో చదువు ఒకసారి ఆరంభమై ఒకచోట ముగుస్తుంది అని చెప్పలేం. జీవితాంతం కొత్తవి నేర్చుకుంటూ, కొత్త నైపుణ్యాలు రూపొందించుకునే సమాజాన్ని వాళ్ళు ఏర్పరుచుకున్నారు. అందువలన జపాన్ తన పరిశ్రమల అభివృద్ధికి, దానికి కావలసినటువంటి శ్రామికశక్తి, నైపుణ్యాలను పెంచడంకోసం తదేకంగా పనిచేస్తూ ఉంటుంది. అక్కడున్న విద్యావిధానం ప్రజల మధ్య అంతరాలని తగ్గించి అందరికీ సమాన అవకాశాలు ఇవ్వడానికి ప్రత్యేకమైన ప్రయత్నం చేస్తుంది. అందువల్ల జపాన్‌లో అత్యంత సుశిక్షితమైన, నైపుణ్యాలు కలిగిన నూతన ఆవిష్కరణలతో ఉన్న శ్రామిక సంపదని చూస్తాం. జపాన్‌లో అన్ని పాఠ్యపుస్తకాలు ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన అన్నిపుస్తకాలు ఇంగ్లీషులో వచ్చిన మరుక్షణమే జపనీస్ భాషలోకి అనువదిస్తూ ఉంటారు. అందువల్ల ప్రపంచంలో వచ్చే సమస్త మార్పులు ఎప్పటికప్పుడు జపనీస్ భాషలోకి వస్తాయి. దీనివల్ల వాళ్ళు ప్రపంచంతో పోటీపడి చదువుకో గలుగుతారు. ఒక్క ఇంగ్లీష్ ముక్క రాకపోయినా జపనీస్ మాధ్యమంగా వాళ్ళు నేర్చుకునే చదువులు సంప్రదాయానికి, సంస్కృతికి ఆనవాళ్లుగా ఉంటాయి. జపాన్ ఒక స్వయంసమృద్ధమైన దేశంగా ఒక జాతిగా శిరస్సు ఎత్తుకుని నిలబడ్డ వైనాన్ని మనం చూస్తున్నాం. అలాగే ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న గ్లోబల్ అవసరాలకు అనుగుణంగా ప్రవేశిస్తున్న ఇంగ్లీషుకి ఎంతవరకు అవకాశం ఇవ్వాలో అంతమాత్రమే ఇస్తుంది జపనీస్ సమాజం. దీనిని మనం

జపాన్ దేశం నుంచి స్వీకరించాల్సిన అవసరం ఉంది అంటే మనఉన్నత విద్యలో దీనిని ఎప్పటికప్పుడు చదువుకునేందుకు వీలుగా ప్రామాణికమైన టెక్ట్సులు, మ్యాగజైన్స్ తెలుగులోకి మారితే తెలుగు వచ్చినవాళ్ళు తెలుగు మాత్రమే వచ్చిన వాళ్ళు కూడా చదువుకోగలుగుతారు. అందువల్ల ఉన్నతవిద్య ఇంగ్లీషులో ఉన్నందువల్ల మేము ఇప్పటి నుంచే ఇంగ్లీష్ మీడియంలో చదివిస్తాము అనే భ్రమ తొలగిపోతుంది.

**ఇప్పుడు జర్మనీ గురించి తెలుసుకుందాం**

జర్మనీ యూరప్‌లో ఒక కీలకమైన నాయకత్వ స్థానంలో ఉంది. యూరోపియన్ యూనియన్‌లో సభ్యదేశంగా, దానికి సంబంధించిన ఆర్థిక పర్యావరణ ప్రమాణాలని నిర్ధారించడంలో చాలా కీలక భూమిక పోషిస్తోంది. ఇప్పుడు జర్మనీ ప్రజాస్వామ్యానికి మానవ హక్కులకు బహుముఖ సహకారానికి ప్రపంచస్థాయిలోనే పేరుపొందింది. ప్రపంచస్థాయిలోనే జర్మనీ పాత్రని రూపుదిద్దడంలో ఆ దేశపు విద్యారంగం నిర్వహించిన విశేష కృషిని పరిశీలిద్దాం.

జర్మనీలో నూతన ఆవిష్కరణలకి, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తికి, సామాజిక ప్రగతికి పెద్దపీట వేసింది. జర్మనీలో ద్వంద్వ విద్యావిధానం ఉంది. స్కూల్లో ప్రతి అంశాన్ని ఒక సిద్ధాంతంగానే చెప్పకుండా. దానికి కావలసిన ఆచరణాత్మకమైన శిక్షణ వివిధ కంపెనీల్లో ఇస్తారు. అప్రెంటీస్ విధానంవల్ల ఉద్యోగ సన్నద్ధత వ్యక్తుల్లో పెరుగుతుంది. ఉద్యోగం పొందే యోగ్యతని కూడా పెంచుకోగలుగుతారు. జర్మనీలో దాదాపు పబ్లిక్ రంగంలో ఉన్న విశ్వవిద్యాలయాలలో ట్యూషన్ ఫీ నామమాత్రమే. అందువల్ల హైయర్ ఎడ్యుకేషన్ జర్మనీ దేశస్థులకు అందుబాటులోకి వచ్చింది. సాంకేతిక విద్యకు సంబంధించినంత వరకు సాంకేతిక విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. మ్యాక్స్ ప్లాంక్ ఇనిస్టిట్యూట్, ఫ్రాన్ హూపర్ సొసైటీ లాంటి సంస్థల్లో ఇంజనీరింగ్ టెక్నాలజీ సైన్సెస్‌లో నూతన ఆవిష్కరణల కోసం ప్రత్యేక ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి.

ఇంకొక విశేషం ఏమిటంటే జర్మనీ తన GDPలో మూడు శాతం పరి శోధన & అభివృద్ధి (R & D) మీద ఖర్చు పెడుతోంది. కొత్త ఆవిష్కరణలకోసం ఆర్ అండ్ డీ అదే పనిగా పని చేస్తూ ఉంటుంది. అంతర్జాతీయ విద్యార్థులను అత్యధికంగా ఆహ్వానించే యూనివర్సిటీలు మాత్రం కొంత మేరకు ఇంగ్లీషు వాడతాయి. స్కూలు స్థాయి నుండి డాక్టర్ స్థాయి వరకు అంతా జర్మన్ భాషలోనే ఉంటుంది. ఈ రకంగా జర్మనీ విద్యారంగం మీద ఒక ప్రధానమైన జాతీయ నిర్మాణశక్తిగా రూపొందిస్తోంది.

జపాన్, జర్మనీ దేశాలు నూతనఆవిష్కరణలతో నైపుణ్యంతో నిండిన శ్రామికశక్తిగా రూపొందుతున్నాయి. ఇలా రూపొంది అనేకరంగాలలో ఏ ఏ దేశాలు ఏ ఏ స్థాయిలలో ఉన్నారో మనకు కింది పట్టిక చూస్తే అర్థంఅవుతుంది. ఇంగ్లీషు ఏకైక లోకరక్షక శక్తిగా మన దేశంలో చాలా మంది మేధావులు ఊదరగొడుతున్నప్పటికీ మాతృభాషనే మాధ్యమంగా, విద్యావిజ్ఞానాలు నేర్చుకుని, ప్రపంచ దేశాలలో నూతన ఆవిష్కరణల్లో, మానవాభివృద్ధి సూచికల్లో దూసుకుపోతున్న దేశాల పరిస్థితిని ఒక్కసారి క్రింది పట్టికలో గమనిద్దాం. ఇప్పటికయినా నిజాన్ని, నిజంగా చూద్దాం, నిజాయితీగా అంగీకరిద్దాం.

| దేశం | ఇన్నోవేషన్ ర్యాంక్ | ఒలింపింక్ పతకాలు | నోబెల్ బహుమతులు | హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ ర్యాంక్ |
|---|---|---|---|---|
| స్విట్జర్లాండ్ | 1 | 205 | 28 | 2 |
| స్వీడన్ | 2 | 661 | 33 | 7 |
| యునైటెడ్ స్టేట్స్ | 3 | 2980 | 403 | 21 |
| యునైటెడ్ కింగ్‌డమ్ | 4 | 950 | 137 | 18 |
| ఫిన్లాండ్ | 6 | 303 | 5 | 10 |
| నెదర్లాండ్స్ | 7 | 415 | 21 | 10 |
| జర్మనీ | 8 | 1385 | 112 | 9 |
| డెన్మార్క్ | 9 | 194 | 14 | 6 |
| దక్షిణ కొరియా | 10 | 287 | 1 | 19 |
| ఫ్రాన్స్ | 11 | 874 | 70 | 28 |
| చైనా | 12 | 634 | 9 | 79 |
| జపాన్ | 13 | 497 | 29 | 19 |
| ఇజ్రాయిల్ | 14 | 10 | 12 | 22 |
| కెనెడా | 15 | 326 | 27 | 16 |

**మూలం:**

1. G.I.I. Data :
https://www.wipo.int/web-publications/global-innovation-index-2024/en/gii-2024-results.html..

2. Olympic Medals : https://olympics.com/ioc/olympic-studies-centre.

3. Nobel Awards :

https://www.nobelprize.org/prizes/lists/all-nobel-prizes/

4. HDI Ranking :

https://hdr.undp.org/content/human-development-report-2023-24

*“అన్ని సబ్జెక్టులనూ ఇంగ్లీష్‌లో నేర్చుకుని, ఆ జ్ఞానాన్ని దైనందిన జీవితానికి అన్వయించుకోవాలని పిల్లలు ప్రయత్నించినపుడు చాలా కష్టాలను ఎదుర్కుంటూ ఉంటారు. దైనందిన అనుభవాలకూ, చదువుకున్న విషయాలకూ పొంతనలేకపోవడం వల్లవచ్చే సమస్యలకు అదనంగా భాష తెచ్చే అంతరం కూడా ప్రధాన సమస్య అవుతుంది. పిల్లలు పాఠశాల బయటే ఎక్కువ సమయాన్ని గడుపుతుంటారు. మరి విభిన్న విషయాలపై అవగాహన కల్పించిన భాష వొకటయితే దైనందిన జీవితంలో ఉపయోగించాల్సిన భాష మరొకటి అవటంవల్ల పిల్లలు ఒకరకమైన గందరగోళం పాలవుతారు.”*

*“ఈ వైరుధ్యం వల్ల, అంటే పిల్లలు తమ ఇంగ్లీష్ మీడియం చదువులవల్ల వచ్చిన జ్ఞానాన్ని జీవితానుభవ జ్ఞానానికి అన్వయించుకోలేక అన్నింటినీ కేవలం ఎప్పుడు అడిగితే అప్పుడు అప్పజెప్పే విధంగా బట్టీపడుతుంటారు. భారతీయ విద్యావ్యవస్థలోని సాంప్రదాయిక పరీక్షా విధానం ఇలా అప్పజెప్పే పద్ధతినే నెలకొల్పగలిగింది కాని విషయాలను లోతుగా పరిశీలించి, అధ్యయనం చేసి, అర్థం చేసుకొనే పద్ధతిని పిల్లల్లో కల్పించలేకపోయింది.”*

**– ప్రొఫెసర్ కృష్ణకుమార్**

*“ఈ 21వ శతాబ్దంలో నిరక్షరాష్యుడు అంటే చదవడం రాయడం రానివాడు కాదు. జ్ఞానం పొందడం, దాని నుంచి పూర్తిగా బయటపడటం, తిరిగి పునర్నిర్మించు కోవడం చేయలేనివాడు.”*

**– ప్రసిద్ధ రచయిత ఆల్విన్ టోఫ్లర్**

# ఇప్పటికైనా...

తెలుగు కోసం, తెలుగువెలుగు కోసం, తెలుగువాళ్ళే తెలుగువాళ్ళ మీద జరుపుతున్న ఈ పోరాటంలో చివరగా కొన్ని స్ఫూర్తిదాయకమైన కథనాలు చెప్పుకుందాం.

అనగనగా ఒక ప్రతిభా సంపన్నమైన జాతి. విద్య, విజ్ఞాన, వైద్య రంగాలలో అందెవేసిన చేతులని ఆ జాతికి జగత్ ప్రసిద్ధమయిన పేరు ఉంది. ఆ జాతి దాదాపు ప్రపంచంలోని అన్ని ఖండాలలో విస్తృతంగా వ్యాపించింది. తాను నివసించే ప్రాంతానికి గుర్తింపుని కూడా తెచ్చిపెట్టింది. తాను నివసించే నేలమీద, మనుషుల మీద, భాషల మీద అనుబంధాన్ని పెంచుకుంది. అయినా ఆ జాతి అనేక ఇతరేతర కారణాలతో ఎన్నో బాధలకు గురయ్యింది. కొన్నిచోట్ల దారుణ మారణకాండకి ఆహుతి అయ్యింది. కొన్నిచోట్ల వివక్షతతో దూరం పెట్టబడింది. ఇన్నిఉన్నా ఆ జాతి తన పుట్టుకని, తన స్వంత మాటని మర్చిపోలేదు. కథలు కథలుగా తమ పూర్వీకులు చెప్పిన సుదీర్ఘ ప్రయాణాన్ని అర్ధం చేసుకుని తమ మాతృభూమికి తిరిగి చేరుకున్నారు. తమ మాతృభూమిలోనూ మళ్ళీ పెద్ద పోరాటమే చేసి స్వంత రాజ్యం స్థాపించు కున్నారు. అప్పటికే చిన్నాభిన్నమై కనిపించీ కనిపించకుండా ఉన్న తమ భాష రూపురేఖలని గుర్తుపెట్టుకొని దానిని జాతీయ భాషగా మళ్ళీ పునరుద్ధరించారు. రెండు, మూడు దశాబ్దాల ప్రయాణంలోనే మళ్ళీ వాళ్ళ మాతృభాషని అన్నిరంగాలలో వ్యాపింపచేశారు. మొదట్లో ప్రాథమిక స్థాయిలో ప్రవేశపెట్టడమే కష్టమనిపించిన భాష... ఇవాళ ఉన్నతవిద్య వరకు వ్యాపించింది. పరిపాలనలో శాస్త్రానికి కూడా కనిపించని భాష... ఇప్పుడు బడిలో, ఏలుబడిలో నిత్యజీవితంలో రాజ్యం ఏలుతోంది. ఆ దేశం మహోన్నతంగా శిరస్సు ఎత్తుకుని నిలబడింది. ఇది ఏ దేశమో మీరు ఊహించగలరా? ఇది ఇజ్రాయిల్ దేశం. ఆ భాష హిబ్రూభాష. మిణుకు మిణుకు మంటున్న హిబ్రూభాషా సరస్వతిని నెత్తికెత్తుకుని, కళ్ళకద్దుకుని, గుండెనిండా ప్రేమించి, అటు దేశానికి ఇటు జాతికి పునర్వైభవం తెచ్చుకున్న ఆ జాతి మనకు ఆదర్శం కావడం అవసరమా కాదా? ఒక్కసారి మన కళ్ళ ముందు తెలుగు తల్లిని తెలుగు తల్లి దురవస్థని గుర్తుతెచ్చుకుందాం. మన కళ్ళలో రెండు వేడి కన్నీటి చుక్కలు సుడులుతిరిగితే మనం ఆచరణవైపు ఎలాగో అలా నడుస్తామని నమ్మవచ్చు.

బడిలో మాధ్యమం సమస్యని సామాన్యుడి కోణం నుండి ఆలోచిద్దాం

మనం హఠాత్తుగా మనకు ఇష్టమైన ఒక చిన్న పల్లెటూరు – ఒక పాకబడిలోకి వెళ్ళి అక్కడి పిల్లలకు అంతకు ముందు వినని కొత్త విషయాలని పరిచయం చేద్దాం.

ఉదాహరణకు ఒక చిన్న గుండుసూది నీళ్ళల్లో మునిగిపోతుంది కదా, పదివేల టన్నుల ఓడ ఎందుకు తేలుతుంది? వర్షాకాలంలోనే వర్షాలు ఎందుకు వస్తాయి? అడవులు లేకపోతే భూమి ఏమైపోతుంది?

లాంటి విషయాలని మామూలు తెలుగులో చెబుదాం. ఆఖరివరుస పిల్లలకు కూడా అర్థమయ్యిందో లేదో చూద్దాం.

ఇలాంటి కాన్సెప్ట్ ఇంగ్లీషు భాషలో వివరిద్దాం (లెక్కప్రకారం మన బడులన్నీ ఇంగ్లీషు బడులే కాబట్టి) చెప్పేవాడి చందం – వినేవాడి బాధని కూడా చూద్దాం. ఒక వంద బడులని యాదృచ్ఛికంగా ఎంపికచేసుకుని దీన్ని పరిశీలిద్దాం. అంతాదాకా ఎందుకు? మన రైతులకు ఒకభూమి వివాదాన్ని గురించో, ఒక కొత్త విత్తనాల గురించో చక్కని తెలుగులో చెబుదాం. రైతులు ఎంత ఉత్సాహంగా జిజ్ఞాసతో పాల్గొంటారో చూద్దాం. నేను కోటా రామచంద్రాపురంలో గిరిజనులకు గిరిజనేతరులకు మధ్య ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. వివాదాలన్నిటికీ మూలకారణం గిరిజనుల అమాయకత్వంతోపాటు వారికెవరూ భూమి హక్కులు.. సమస్యలను గురించి వివరించి చెప్పలేకపోవడం. అందుకోసమని 'భూమివాచకం' అనే పుస్తకాన్ని రూపొందించడం జరిగింది. దీని ఆధారంగా భూమికి సంబంధించిన సమస్యలను వివరిస్తూ రైతులను చైతన్యవంతులను చేయడం జరిగింది. రైతులు సమస్యను అర్థం చేసుకుని చట్టపరిధిలో పోరాటం చేయడం ఆరంభించారు. నేను జిల్లా కలెక్టరుగా పాలేకర్ గారిని నల్గొండకు ఆహ్వానించినప్పుడు షుమారు రెండు వేల మంది రైతులు సభలో పాల్గొన్నారు. రైతుల జిజ్ఞాసని పాలేకర్ గారు సరళమైన విధానంలో చెప్పటాన్ని కళ్ళారా చూశాను.

ఇలా అందరికీ అనుభవంలో ఉన్న విషయాలని కూడా విస్మరించి ఇంగ్లీష్ మీడియం కోసం ఆఖరికి సుప్రీంకోర్టు దాకా వెళ్ళి మీరే తీర్పు చెప్పండి అని అడగటం, అదీ పిల్లలకు వ్యతిరేకంగా ప్రభుత్వం వెళ్ళడం ఊహించడానికే కష్టంగా ఉంటుంది. అయినా మన దగ్గర అది జరిగింది. వాళ్లంటున్న ఇంగ్లీషు మీడియం వాదానికి ఒక్కటంటే ఒక్క ఋజువుని కూడా ప్రభుత్వం చూపించలేక పోయింది. రాజు కన్నా మొండివాడు బలవంతుడు అంటారు. రాజే మొండివాడు అయితే ఇంకా చెప్పేది ఏముంది?

మన తెలుగుని మనం ఇలా దూరంచేసుకుంటూ ఉంటే తక్కిన దేశాలలో ఒక విచిత్రమైన ఉద్యమం నడుస్తోంది. దానిపేరు 'ప్లెయిన్ ఇంగ్లీషు మూమెంట్'. అటు శాస్త్ర విజ్ఞానంలోనూ, ముఖ్యంగా చట్టాల్లోనూ క్లిష్టంగా ఉండే వాక్యాలను తొలగించి,

అత్యంత సరళమైన భాషలో ఎలారాయాలో అనేది ఆ ఉద్యమం యొక్క లక్ష్యం. దీనికి ప్రభుత్వం, భాషావేత్తలు కలిసి పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. మన దగ్గర మాత్రం మనకి భాషని కాపాడుకోవడమే పెద్ద ఉద్యమం అయిపోయింది.

**"ఇతర భాషను నేర్చుకోవాలంటే, ముందుగా మీ భాషను ప్రేమించాలి."**

**- జోహన్‌వోల్ఫ్‌గాంగ్ వాన్ గోథే**

ఆఖరుగా మన తెలుగుజాతి మన తెలుగుజాతి అని జబ్బలు చరుచుకుంటున్న వాళ్ళు గుర్తుపెట్టుకోవాల్సింది ఇది.

- మన చదువులు మన భాషలో మన మాటల్లో సాదాసీదాగా ఉండాలి.
- మనఆలోచనలువికసించాలి.
- మనం చేసే పనిలో పరిశోధనలో తేటతనం రావాలి.

అప్పుడు సహజంగానే మన యొక్క బుద్ధివికాసం పెరగడమేకాకుండా మనస్సు సృజనశీలం అవుతుంది. కొత్త ఆవిష్కరణలకి మనం నాంది పలుకుతాం. ప్రపంచంలో కొత్త ఆవిష్కరణలు చేసే వ్యక్తులు, జాతులు మాత్రమే గుర్తించబడుతారు, గౌరవించబడతారు. నేటి కాలానికి అనుగుణంగా మార్కెట్లో దూసుకు వెళ్ళగలుగుతారు.

మన సృజనాత్మకత, మన నూతన ఆవిష్కరణలు ప్రపంచంలో మన స్థానాన్ని నిర్ణయిస్తాయి. ఆ రోజున మన భాషని అన్ని దేశాలు నేర్చుకుంటాయి. ఇది మన సంకల్పంతోనే సంభవం అవుతుంది. చాలా దేశాలలో ఇది జరుగుతోంది. ఇంకా జరుగుతుంది. చైనీస్ (మండారిన్), జర్మన్, జాపనీస్, స్పానిష్, భాషలు ఇందుకు ఉదాహరణ. చాలా దేశాలలో నేర్చుకుంటున్నారు కూడా. ఇది సృజనాత్మకమైన దేశాల నూతన ఆవిష్కరణల బలం. మన భాషలోనే మనం సమర్థంగా మన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లగలం.

అలా మనం కూడా నూతన ఆవిష్కరణలతో, సృజనాత్మకంగా, నింగిదాకా ఎదగాలి అనుకుంటే మన మాతృభాషే మనకు బలం, బలగం. ఈ విషయంలో మనం మేల్కొనకపోతే కాలం మనల్ని క్షమించదు. దీనిని గుర్తుంచుకుని మన భాషావిధివిధానాలు రూపొందించుకుంటే ఆ రోజున తెలుగుజాతి అంటే ఏమిటో తెలుగువారి భాష పౌరుషం ఏమిటో ప్రపంచానికి తెలిసివస్తుంది.

✤ ✤ ✤